# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com   ఎడిటర్: భైస దేవదాస్ సెల్:9000065433   E-mail:netinijam93@gmail.com

హైదరాబాద్ శుక్రవారం 24-4-2026   NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 • Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001.   సంపుటి :32   సంచిక:199   పేజీలు:6   వెల: రూ.1/-


**నేటి కందం- నేటికి అందం**

సీ యా ర్పీ యఫ్ దేశపు
గాయములను మాన్పు ననుచు కమ్మని గతిలో
శ్రేయమ్ముల నిడునని చూ
చాయగ నాయకుడు బండి సంజయ్ చెప్పెన్ !!

(సీ యార్ పీ యఫ్ దేశానికి శ్రేయోదాయకమైన రక్షణ నిచ్చి భద్రత కలిగిస్తుందని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు.)



-రాధశ్రీ
సెల్:9494481210

**చురక**

సర్కారు వైఖరితో
చర్చలన్నీ విఫలం
ఆగిపోయే రవాణా
ఆర్టీసి సమ్మె ఫలం.
సంఘాలు సమ్మెలను
చేసే రద్దు గత పాలన
ప్రభుత్వం ఇప్పుడైనా
పరిష్కరిస్తే హిత పాలన



-వేల్పుల నారాయణ
9440433475

## బెంగాల్‌లో గెలుపు మాదే.. మే 4న స్వీట్లు పంచుతాం : ప్రధాని మోదీ



న్యూఢిల్లీ, ఏప్రిల్ 23:పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపు తమదేనని ప్రధాని నరేంద్రమోదీ ధీమా వ్యక్తంచేశారు. మే 4న ఎన్నికల ఫలితాలు వెలువడగా తాము స్వీట్లు పంచుతామని చెప్పారు. బెంగాల్‌లో రెండు విడతల ఎన్నికల పోలింగ్లో భాగంగా ఇవాళ తొలి విడత పోలింగ్ జరుగుతోంది. ఈ నెల 29న రెండో విడత పోలింగ్ జరగనుంది. ఈ క్రమంలో రెండో విడత పోలింగ్ జరిగే ప్రాంతాల్లో ప్రధాని ప్రచారం చేస్తున్నారు. ఇవాళ నదియా జిల్లా లో జరిగిన ఎన్నికల ప్రచార సభలో ప్రధాని ప్రసంగించారు.

ఈ సందర్భంగా బెంగాల్ ముఖ్యమంత్రి మమతాబెనర్జీపై ప్రధాని తీవ్ర విమర్శలు గుప్పించారు. గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఓటింగ్ భారీగా జరిగిన ప్రాంతాల్లో బీజేపీ ఘన విజయం సాధించి ందని అన్నారు. ఈసారి భారీగా పోలింగ్ జరుగుతున్నదని, బీజేపీ గెలుపు ఖాయమని చెప్పారు. మే 4న బీజేపీ చరిత్ర సృష్టించనుందని అన్నారు. ఆ తర్వాత రాష్ట్రమంతటా మిఠాయిలు పంచి వేడుక చేసుకుందామని సభకు వచ్చిన జనాలను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. మమతా బెనర్జీని ఓటర్లు సాగనంపబోతున్నారని అన్నారు.

మే 4న ఎన్నికల ఫలితాల తర్వాత స్వీట్లతోపాటు ఝాల్‌ముడి కూడా పంచుతామని ప్రధాని అన్నారు. ఇటీవల బెంగాల్‌లో నేను ఝాల్‌ముడి తింటే మంట మాత్రం టీఎంసీకి తగిలిందని వ్యంగ్యాస్త్రాలు గుప్పించారు. కాగా తొలి విడత ఎన్నికల పోలింగ్‌లో ఓటింగ్ భారీగా నమోదవుతోంది. ఉదయం 11 గంటలకే పోలింగ్ 45 శాతం దాటింది. కాగా ఈసారి ఎన్నికలు ఇంత ప్రశాంతమైన వాతావరణంలో కొనసాగడం కీలకమైన పరిణామమని ప్రధాని అన్నారు.

## ఉత్తరాఖండ్ లో ఘోర రోడ్డు ప్రమాదం
### 8మంది మృతి..

న్యూఢిల్లీ, ఏప్రిల్ 23: ఉత్తరాఖండ్ లో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. టెహ్రీ గర్వాల్ జిల్లాలోని చంబా-కోటీ రహదారిపై వాహనం అదుపుతప్పి లోయలో పడిపోవడంతో 8 మంది ప్రాణాలు కోల్పోయారు.

సమాచారం ప్రకారం, వాహనం సుమారు 300 మీటర్ల లోతైన లోయలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో పలువురు తీవ్రంగా గాయపడ్డారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు వెంటనే సహాయక చర్యలు ప్రారంభించారు.

గాయపడిన వారిని సమీప ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రమాదానికి గల కారణాలపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ ఘటనతో ప్రాంతంలో విషాద వాతావరణం నెలకొంది.

## భరూచ్ కెమికల్ ఫ్యాక్టరీలో భారీ పేలుడు..
## మంటలు వ్యాపించి కార్మికులకు గాయాలు

న్యూ ఢిల్లీ, ఏప్రిల్ 23: గుజరాత్‌లోని ఒక కెమికల్ ఫ్యా క్టరీలో భారీ పేలుడు కారణంగా మంటలు వ్యాపించాయి. దీంతో అనేకమంది కార్మికులు గాయ పడ్డట్లు సమాచారం. ఈ ఘటన గుజరాత్, భరూచ్ జిల్లా, ఝగాడియా ప్రాంతంలోని జీఐడీసీ పరిధిలో గురువారం జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక మెట్రోపాలిటన్ ఎక్సిమ్‌కెమ్ అనే పరిశ్రమ ఔట్‌లెట్ వద్ద ఈ ప్రమాదం జరిగింది.

ఇక్కడ ఇతర పరిశ్రమలకు అవసరమయ్యే రసాయనాల్ని భారీగా తయారు చేస్తారు. దేశంలోని కీలక రసాయన పరిశ్రమల్లో ఇదీ ఒకటి. ఈ పరిశ్రమ పరిధిలో ఒక పేలుడు జరిగింది. దీని కారణంగా మంటలు భారీ స్థాయిలో వ్యాపించాయి. ఈ ఘటనలో అనేకమంది కార్మికులు గాయపడ్డారు. దీనిపై సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు ఇక్కడికి చేరుకుని సహాయక చర్యలు కొనసాగి స్తున్నారు. గాయపడిన వారిని స్థానిక ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. అగ్నిమాపక వాహనాలు మంటలను ఆర్పేందు కు ప్రయత్నిస్తున్నాయి. పోలీసు ఉన్నతాధికారులు పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. మంటల కారణం గా చుట్టుపక్కల పొగ భారీగా వ్యాపించిం ది. ఈ ప్రమాదం జరిగిన సమ యంలో పరిశ్రమలో ఎంత మంది ఉన్నారు అనే విషయాలు ఇంకా తెలియరాలేదు. ఈ ఘటనతో స్తానికులు భయాందోళనకు గురయ్యారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. ఈ ప్రమాదానికి సంబంధించి ఇంకా పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.





## భారత్, చైనాలు నరకాలు కావు..
## మానవాళికి మహోన్నత దేశాలు: ట్రంప్‌నకు ఇరాన్ కౌంటర్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 23:భారత్, చైనాలను నరకాలతో పోలుస్తూ అమెరికన్ రేడియో వ్యాఖ్యాత మైఖేల్ సావేజ్ షేర్ చేసిన లేఖను రీ-పోస్ట్ చేసిన డొనాల్డ్ ట్రంప్‌నకు ఇరాన్ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చింది. భారత్, చైనాలు నరకాలు కావని, మానవాళికి మహోన్నత దేశాలని పేర్కొంది. నాగరికతకు భారత్ పుట్టినిల్లు అంటూ హైదరాబాద్‌లోని ఇరాన్ ఎంబసీ ఓ పోస్ట్ చేసింది

'భారత్, చైనాకు చెందిన కొందరు మహిళలు తొమ్మిదో నెలలో అమెరికాకు వచ్చి ఇక్కడ పిల్లల్ని కంటున్నారు. ప్రస్తుత చట్టం కారణంగా ఆ శిశువులు అప్పటికప్పుడు అమెరికా పౌరులు అయిపోతున్నారు. ఆ తరువాత వారు చైనా, భారత్, ఇతర నరకప్రాయ దేశాల నుంచి తమ కుటుంబాల్ని తీసుకొస్తున్నారు. భారతీయులు, చైనా వారు లాప్‌టాప్ పట్టుకున్న గ్యాంగ్‌స్టర్లు' అని మైఖేల్ షేర్ చేసిన ఓ లేఖను ట్రంప్ తన సోషల్ మీడియా ఖాతాలో రీ-పోస్ట్ చేశారు

ట్రంప్ పోస్ట్‌కు ఇరాన్ కౌంటర్ ఇచ్చింది. 'భారత్, చైనాలు మహోన్నత నాగరికతకు పుట్టినిళ్లు. ప్రపంచంలోనే అత్యంత పురాతన నాగరికతలకు నిలయాలు. ఒక దేశ నాగరికతను నాశనం చేస్తామని బెదిరించే నాయకత్వం ఉన్న చోటే నిజమైన నరకం' అని ఇరాన్ పేర్కొంది. ఇరాన్ నాగరికతను అమెరికా నాశనం చేస్తుందని కొద్ది రోజుల క్రితం ట్రంప్ బెదిరించిన సంగతి తెలిసిందే.

## కాళేశ్వరం తీర్పుపై సుప్రీంకోర్టుకు తెలంగాణ సర్కార్

హైదరాబాద్, ఏప్రిల్ 23: కాళేశ్వరం ప్రాజెక్ట తీర్పు నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ అంశంపై సుప్రీంకోర్టును ఆశ్రయించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.

కాళేశ్వరం తీర్పును సవాలు చేస్తూ స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేయాలని టీజీ సర్కార్ నిర్ణయిం చింది. ఇప్పటికే న్యాయ విభాగంతో చర్చలు పూర్తయ్యాయని, తదుపరి చర్యలకు సిద్ధమవుతున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. ప్రాజెక్టుకు సంబంధించిన వివిధ అంశాలపై న్యాయస్థానంలో పూర్తి వివరాలు సమర్పించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ పరిణామం రాష్ట్ర రాజకీయాల్లోనూ, పాలనా వర్గాల్లోనూ చర్చనీయాంశంగా మారింది.

కాగా, కాళేశ్వరం ప్రాజెక్టులో అవకతవకలపై విచారణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌పై దాఖలైన పిటిషన్లపై తెలంగాణ హైకోర్టు సంచలన తీర్పు వెల్లడించిన సంగతి తెలిసిందే. కమిషన్ సమర్పించిన నివేదిక ఆధారంగా బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావు, ఐఏఎస్ అధికారి స్మితా సబర్వాల్, మాజీ ఐఏఎస్ జోషిపై ఎలాంటి చర్యలు తీసుకోరాదని ప్రభుత్వాన్ని ఆదేశించింది. అంతేకాకుండా, జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ విచారణలో పలు నిబంధనలు పాటించలేదని హైకోర్టు అభిప్రాయపడింది. ఈ నేపథ్యంలో కమిషన్ నివేదిక ఆధారంగా ముందస్తు చర్యలు చేపట్టరాదని స్పష్టం చేసింది.

## బెంగాల్‌లో బీజేపీ గెలిస్తే చొరబాట్లు ఉండవు..
## మే 5న దీదీ ఆట ముగుస్తుంది : అమిత్ షా

న్యూఢిల్లీ, ఏప్రిల్ 23:పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ అధికారంలోకి వస్తే రాష్ట్రంలోకి అక్రమంగా ఎవ్వరూ చొరబడలేరని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అన్నారు. ఒక్కరిని కూడా అక్రమంగా రానివ్వబోమని ప్రజలకు హామీ ఇచ్చారు. బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా హుగ్లీ జిల్లా, బాలాగర్‌లో గురువారం జరిగిన ప్రచార కార్యక్రమంలో అమిత్ షా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కీలక వ్యాఖ్యలు చేశారు. "పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ అధికారంలోకి వస్తే



ఒక్కరిని కూడా అక్రమంగా చొరబడ నివ్వం. ఇప్పటికే ఉన్న అక్రమ చొరబాటుదారుల్ని గుర్తించి, పంపించివేస్తాం. బెంగాల్ ఆర్థిక వ్యవస్థకు, భద్రతకు అక్రమ వలసదారులు హాని కలిగిసు_్తన్నారు. రాష్ట్ర యువతకు దక్కాల్సిన ఉద్యోగాలు, రేషన్ వంటివి దోపిడీ చేస్తున్నారు. దేశ భద్రతను దెబ్బతీసేందుకు కుట్ర పన్నుతున్నారు. మీరు ఇప్పుడు ఓటు వేయబోయేది ఒక ఎమ్మెల్యే కోసమో.. బీజేపీ ప్రభుత్వం కోసమో కాదు. అక్రమవలసదారుల నుంచి రాష్ట్ర విముక్తి కోసం కూడా. ఈ రోజు బెంగాల్ తొలి దశ ఎన్నికలు ముగు స్తున్నాయి. ఇది బెంగాల్‌లో నా 30వ ప్రచార సభ. రెండో దశ ఎన్నికల్లో కూడా బీజేపీకి ఓటు వేయండి. మే 5న దీదీ ఆట ముగుస్తుంది. పూర్తి మెజారిటీతో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటవు తుంది'' అంటూ అమిత్ షా వ్యాఖ్యానిం చారు. గురువారం పశ్చిమ బెంగాల్‌లో అసెంబ్లీ తొలిదశ ఎన్నికలు జరుగుతున్న సంగతి తెలిసిందే. సాయంత్రం ఐదు గంటల వరకు దాదాపు 89 శాతం ఓటింగ్ నమోదైంది. దీంతో పూర్తి ఎన్నిక ముగిసే సరికి ఇంకా భారీ ఓటింగ్ నమోదయ్యే అవకాశం ఉంది. రెండో దశ ఎన్నికలు ఈ నెల 29న జరుగుతాయి. మే 4న ఫలితాలు విడుదలవుతాయి.

## వైద్యుల గైర్హాజరుపై కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆగ్రహం

నల్గొండ, ఏప్రిల్ 23:ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యులు రోగులకు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండాలని, లేదంటే చర్యలు తప్పవని సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ హెచ్చరించారు. గురువారం హుజుర్ నగర్ ఏరియా ఆస్పత్రిని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆ సమయంలో డాక్టర్లు అందుబాటులో లేకపోవడంపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కొంత మంది సమయం కాకముందే విధుల నుండి వెళ్లిపోవడంపై కలెక్టర్ ఆరా తీశారు. అనంతరం డయాలసిస్ కేంద్రం, బ్లడ్ బ్యాంక్ కేంద్రాలను పరిశీలించారు. రోగులకు అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వైద్యులు విధి నిర్వహణలో సమయానికి రోగులకు అందుబాటులో ఉండాలని, రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. ఓపి విభాగంలో సమయపాలన పాటించని డాక్టర్లను, కాంట్రాక్టు డాక్టర్లపై చర్యలు తీసుకోవాలని సంబంధిత సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. ఇందుకు సంబంధించి పూర్తి నివేదికను అందించాలన్నారు.

ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరోగ్య కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. గర్భిణులు, బాలింతల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, సాధారణ ప్రసవాలు అధికంగా జరిగేలా అవగాహన కల్పించాలని సూచించారు. ఆస్పత్రి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పారిశుధ్య నిర్వహణ పట్ల అప్రమత్తంగా



ఉండాలన్నారు. ఈ సందర్భంగా ఆస్పత్రి పారిశుధ్య నిర్వహణపై శానిటేషన్ సిబ్బందిని, నర్సింగ్ ఆఫీసర్లను అభినందించారు. కాయకల్పలో అవార్డు పొందాలని ఆకాక్షించారు.మెరుగ్గా పారిశుధ్య పనులను నిర్వహించి ఆసుపత్రి పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉండే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆసుపత్రిలోని అత్యవసర విభాగం, ఓపి విభాగం, బ్లడ్ స్టోరేజి విభాగాలను కలెక్టర్ పరిశీలించారు.

నూతనంగా నిర్మిస్తున్న ఓపి బ్లాక్ నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం సిటీ స్కాన్ మిషన్ పని తీరును పర్యవేక్షించారు. టీ హబ్ నిర్వహణలో ఉన్న లోపాలను అధికారులతో మాట్లాడి తక్షణమే సమస్యను పరిష్కరించాలని జిల్లా అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ డివిజనల్ అధికారి శ్రీనివాసులు, సూపరింటెండెంట్ డాక్టర్ శ్రవణ్ కుమార్, ఆర్ఎంఓ డాక్టర్ రవి కుమార్, గైనకాలజిస్ట్ డాక్టర్ వనజ, వైద్యులు, నర్సింగ్ ఆఫీసర్లు, శానిటేషన్ సిబ్బంది, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## హిందూ మహాసముద్రంలో ఇరాన్ చమురు నౌక సీజ్.. ప్రకటించిన అమెరికా..!

న్యూ ఢిల్లీ, ఏప్రిల్ 23:ఇరాన్-అమెరికా దేశాల మధ్య కాల్పుల విరమణ కొనసాగుతున్నప్పటికీ.. అగ్రరాజ్యం అమెరికా వరుసగా నౌకలను సీజ్ చేస్తున్న ఘటనలు ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఇటీవల హర్మూజ్ జలసంధి లో ఇరాన్‌కు చెందిన ఓ నౌకను అగ్రరాజ్యం స్వాధీనం చేసుకుంది. తాజాగా హిందూ మహాసముద్రం లోనూ మరో నౌకను అమెరికా సైన్యం సీజ్ చేసింది. ఈ విషయాన్ని అగ్రరాజ్య రక్షణ మంత్రిత్వ శాఖ వెల్లడించింది.

'మేజిస్టిక్ ఎక్స్' పేరుతో ఉన్న నౌకను తమ దళాలు స్వాధీనం చేసుకున్నట్లు అమెరికా ప్రకటించింది. ఆ నౌకలో ఇరాన్ చమురును అక్రమంగా తరలిస్తున్నట్లు అగ్రరాజ్యం పేర్కొన్నది. 'ఇరాన్‌కు సైనిక సాయం అందించే నౌకలను, సముద్ర మార్గంలో అక్రమ రవాణా నెట్‌వర్క్‌ను తాము అడ్డుకుంటూనే ఉంటామని అమెరికా తన పోస్ట్‌లో రాసుకొచ్చింది. నౌక సీజ్‌కు సంబంధించిన వీడియోను 'ఎక్స్' ఖాతాలో విడుదల చేసింది. హెలికాప్టర్ల నుంచి ఈ నౌకపైకి అమెరికా దళాలు దిగుతున్న దృశ్యాలు అందులో ఉన్నాయి.

షిప్ ట్రాకింగ్ డేటా ప్రకారం.. ఈ 'మేజిస్టిక్ ఎక్స్' నౌక శ్రీలంక, ఇండోనేసియా మధ్య హిందూ మహాసముద్రంలో ప్రయాణిస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. ఇటీవల హర్మూజ్ జలసంధి వద్ద ఇరాన్ పతాకంతో ప్రయాణిస్తున్న 'తౌస్కా' అనే వాణిజ్య నౌకను అమెరికా సీజ్ చేసింది. ఆ నౌకలో క్షిపణి తయారీలో ఉపయోగించే రసాయనాలు ఉన్నట్లు వార్తలు వచ్చాయి. కాగా తమ వాణిజ్య నౌకను సీజ్ చేయడంపై ఇరాన్ ఆగ్రహం వ్యక్తంచేసింది. నౌకను, అందులోని సిబ్బందిని విడుదల చేయాలని డిమాండ్ చేసింది.

## భార్యను ఇంటికి పంపేందుకు నిరాకరణ..
## అత్త వారింటికి నిప్పుపెట్టిన వ్యక్తి

ముంబై, ఏప్రిల్ 23: పుట్టింట్లో ఉంటున్న భార్యను పంపేందుకు అత్తింటి వారు నిరాకరించారు. దీంతో ఆగ్రహించిన వ్యక్తి వారి ఇంటికి నిప్పుపెట్టాడు. వేసవి కావడంతో ఆ మంటలు వ్యాపించి పొరుగువారి ఇల్లు కూడా కాలిపోయింది. మహారాష్ట్రలోని నందుర్బార్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. భర్త మిథున్ పద్వీతో గొడవ కారణంగా అతడి భార్య కొంతకాలంగా పుట్టింట్లో నివసిస్తున్నది.

కాగా, తన భార్యను తిరిగి తీసుకెళ్లేందుకు మిథున్ పలు మార్లు అత్తమామల ఇంటికి వెళ్ళాడు. అయితే ప్రతిసారీ ఆమెను అతడితో పాటు పంపడానికి వారు నిరాకరించారు. పదేపదే ఇలా జరుగడంతో మిథున్ తీవ్ర ఆగ్రహం చెందాడు. అత్తమామల ఇంటికి నిప్పుపెట్టి పారిపోయాడు.

మరోవైపు వేసవి కావడంతో మంటలు తీవ్రమయ్యాయి. క్షణాల్లోనే పొరుగున నివసించే సుభాష్ వాల్వీ ఇంటికి కూడా మంటలు వ్యాపించాయి. మంటలు ఆర్పేందుకు స్థానికులు ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకపోయింది. ఆ రెండు ఇళ్లు పూర్తిగా కాలిపోయాయి. ఈ నేపథ్యంలో అత్త ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేశారు. పారిపోయిన మిథున్ కోసం వెతుకుతున్నారు.

## తమిళనాడు, బెంగాల్‌లో ముగిసిన పోలింగ్.. రికార్డు స్థాయిలో ఓటింగ్ నమోదు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 23: తమిళనాడు, పశ్చిమ బెంగాల్ అసెంబ్లీకి జరుగుతున్న ఎన్నికలు ముగిశాయి. గురువారం సాయంత్రం ఐదు గంటల వరకు రెండు రాష్ట్రాల్లో రికార్డ్ స్థాయి ఓటింగ్ నమోదైంది. తమిళ నాడులో 82 శాతానికిపైగా, పశ్చిమ బెంగాల్‌లో 89 శాతానికి పైగా ఓటింగ్ నమోదైంది. పశ్చిమ బెంగాల్‌కు సంబంధించి ఇవి మొదటిదశ ఎన్నికలు మాత్రమే. మరో దశ ఎన్నికలు ఈ నెల 29న జరుగుతాయి.రెండు రాష్ట్రాల్లో ఇంకా ఓటింగ్ కొనసాగుతోంది. దీంతో ఓటింగ్ శాతం ఇంకా పెరుగుతుంది. సాయంత్రం ఆరు గంటల వరకు క్యూలైన్లలో నిలుచున్న వారికి ఎంత సమయమైనా ఓటు వేసే అవకాశం కల్పిస్తారు. దీని ప్రకారం తుది ఓటింగ్ వెలువడటానికి మరింత సమయం పడుతుంది. తమిళనాడుకు సంబంధించి మొత్తం 234 స్థానాలకు ఒకేసారి గురువారం ఎన్నిక జరిగింది. ఈ రాష్ట్రంలో 5.7 కోట్ల మంది ఓటర్లున్నారు. డీఎంకే కూటమి, ఏఐఏడీఎంకే కూటమి, టీవీకేలు ప్రధాన పార్టీలుగా ఉన్నాయి. పశ్చిమ బెంగాల్‌లో తొలి దశలో గురువారం 152 అసెంబ్లీ స్థానాలకు ఎన్నికలు జరిగాయి. కొన్ని చోట్ల బెంగాల్‌లో ఘర్షణ వాతావరణం తలెత్తింది. పలుచోట్ల టీఎంసీ నేతలు.. ఇతర పార్టీలవారిపై దాడులు చేశారు.




# అంగన్‌వాడీ సేవలు పారదర్శకంగా అందించడమే ప్రభుత్వ లక్ష్యం

## - పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు
## -అంగన్‌వాడీలకు స్మార్ట్ ఫోన్ల పంపిణీ

ఖమ్మం, ఏప్రిల్ 23:అంగన్‌వాడీ కేంద్రాల పనితీరును మరింత ఆధునీకరించడంతో పాటు అంగన్‌వాడీ సేవలు పారదర్శకంగా, సమర్ధవంతంగా అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం బూర్గంపహాడ్ మండల పరిధిలోని సారపాక వాసవీ ఫంక్షన్‌హాల్ ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీలకు స్మార్ట్‌ఫోన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడారు. అంగన్‌వాడీ కార్యకర్తల విధుల్లో ఆధునీకతను జోడించే దిశగా ఈ స్మార్ట్ ఫోన్లను అందించేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. వీటివల్ల అంగన్‌వాడీలకు సేవలు సులభతరంగా ఉండటంతో పాటు పారదర్శకంగా ఉండేలా ఉపయోగ పడతాయన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో కార్యకలాపాలను డిజిటలైజ్ చేయడం ద్వారా సేవల్లో వేగం పెరుగుతుందన్నారు.



గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారం, ఆరోగ్య సేవలను ఈ స్మార్ట్ ఫోన్ల ద్వారా పారదర్శకంగా ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేసే వీలుంటుందన్నారు. అనంతరం మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు స్మార్ట్‌ఫోన్లను సీడీపీఓ రేవతితో కలిసి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ జమలారెడ్డి, ఐసీడీఎస్ సీడీపీఓ రేవతి, సర్పంచులు కిషోర్‌నాయక్, మందా నాగరాజు, ఉప సర్పంచ్ కన్నెదారి రమేష్, ఈఓ మహేష్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, స్థానిక నాయకులు భజన సతీష్, ప్రసాద్, ఇంగువ రమేష్, మహిమూదాఖాన్, పూలపెల్లి సుధాకర్రెడ్డి, మండలంలోని అన్ని కేంద్రాల అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

# ఎంఎస్ఎంఈ రంగంలో సహకారాన్ని బలోపేతం చేసేందుకు భారత్, దక్షిణ కొరియా మధ్య అవగాహన ఒప్పందం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 23: రిపబ్లిక్ ఆఫ్ కొరియా అధ్యక్షుడు శ్రీ లీ జే మ్యూంగ్ నేతృత్వంలోని ప్రతినిధి బృందం ప్రస్తుతం భారత్ పర్యటనలో ఉంది. ఈ సందర్భంగా ఎంఎస్ఎంఈ రంగంలో ద్వైపాక్షిక సహకారాన్ని బలోపేతం చేయడానికి సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల మంత్రిత్వ శాఖ.. కొరియా ఎంఎస్ఎంఈలు, స్టార్టప్‌ల మంత్రిత్వ శాఖతో ఏప్రిల్ 20, 2026న ఒక అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకుంది.

ఈ ఒప్పందం రెండు మంత్రిత్వ శాఖల మధ్య సహకారం కోసం ఒక నిర్మాణాత్మక విధానాన్ని ఏర్పాటు చేస్తుంది. ఇది ఎంఎస్ఎంఈ రంగానికి సంబంధించిన కీలక అంశాలపై నిరంతర చర్చలకు వీలు కల్పిస్తుంది. పరస్పర ప్రయోజనకరమైన అవకాశాలను అన్వేషించడంలో తోడ్పడుతుంది. ఇరు దేశాల ఎంఎస్ఎంఈ వ్యవస్థలపై లోతైన అవగాహనను పెంపొందించడానికి, సంబంధిత వాటాదారుల మధ్య భాగస్వామ్యాన్ని మెరుగుపరచడానికి కృషి చేస్తుంది.

సమాచారం, నిపుణుల మార్పిడి, ఉత్తమ విధానాల భాగస్వామ్యం, వ్యాపార అనుసంధానాలు, సాంకేతిక-ఆర్థిక సహకారం ద్వారా వాణిజ్యం, పెట్టుబడులను ప్రోత్సహించడం ఈ ఒప్పంద లక్ష్యం. ఇది ఇరు దేశాల ఎంఎస్ఎంఈల మధ్య సంబంధాలను బలోపేతం చేసే ఉమ్మడి కార్యక్రమాలకు కూడా మద్దతు ఇస్తుంది.

భారత్-కొరియా ఆర్థిక సహకారాన్ని మరింత పెంపొందించే దిశగా ఈ భాగస్వామ్యం కీలక ముందడుగు. సమగ్ర వృద్ధి, ఆవిష్కరణలు, ఉపాధి కల్పనలో కీలక పాత్ర పోషించే ఎంఎస్ఎంఈలకు సాధికారత కల్పించడంలో ఇరు దేశాల ఉమ్మడి నిబద్ధతను ఈ ఒప్పందం ప్రతిబింబిస్తుంది.

# ఎండల తీవ్రత దృష్ట్యా జనగణ శిక్షణను ఒక పూట కుదించాలి



ఆదిలాబాద్, ఏప్రిల్ 23:అదిలాబాద్ జిల్లా ఉట్నూర్ లో జనగణన పై ఇస్తున్న శిక్షణా తరగతులను ఎండల తీవ్రత కారణంగా రెండు పూటలు ఇచ్చే ఒక పూట కు కుదించి నిర్వహించాలని టీజీ టీటీఎఫ్ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షులు జాదవ్ రవీందర్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ సంఘం నాయకులు గురువారం శిక్షణ తరగతులలో పాల్గొన్న ఉట్నూర్ డిప్యూటీ తాసిల్దార్ అమృత్ లాల్ కు వినతిపత్రం ఇచ్చినట్లు వారు తెలిపారు.

ఈ విషయం ఉన్నత అధికారుల దృష్టికి తీసుకువెళ్లాలని ఎండల తీవ్రత అధికంగా ఉండడం వల్ల ఇబ్బందులు అవుతున్నాయని సంఘ నాయకులు ఇచ్చిన అభివృద్ధి పత్రంలో పేర్కొన్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘ నాయకులు జాదవ్ ఉత్తమ్, రాథోడ్ దత్తరాం, రాథోడ్ గోవింద్,సుఖేందర్, వెంకట్రావు, తదితరులు పాల్గొన్నారు.

# 2,000కి పైగా శిక్షణా కోర్సులతో 88 లక్షల మంది వినియోగదారులను నమోదు చేసిన ఐజీఓటీ కర్మయోగి: మంత్రి

న్యూ ఢిల్లీ, ఏప్రిల్ 23: దేశవ్యాప్తంగా 750కి పైగా జిల్లాల్లో ప్రధానమంత్రి అత్యుత్తమ సేవా పురస్కారాల పట్ల ఆదరణ గణనీయంగా పెరిగింది. దీనికి అనుగుణంగా పోటీల్లో పాల్గొనేవారి సంఖ్య కూడా పెరిగింది. ఇందుకు అవార్డుల కోసం వచ్చే దరఖాస్తులే నిదర్శనం. 2023లో దరఖాస్తులు 1,216 ఉండగా, 2024లో 1,588కి.. 2025లో 2,035కి పెరిగాయి. ప్రభుత్వ అధికారుల నైపుణ్యాన్ని పెంచే ఐజీఓటీ కర్మయోగి వేదికలో ఇప్పటివరకు 88 లక్షల మందికి పైగా అధికారులు చేరారు. వారు 2,000 కంటే ఎక్కువ శిక్షణ కోర్సులను వినియోగించుకున్నారు. అలాగే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ అయిన సీపీజీఆర్ఏఎంఎస్ ద్వారా వచ్చే ఫిర్యాదుల సంఖ్య 2014లో ఏడాదికి 2 లక్షలు ఉండగా, ప్రస్తుతం అది 25,30 లక్షలకు పెరిగింది. వీటిలో 95 శాతానికి పైగా కేసులను పరిష్కరించారు. సగటు పరిష్కార సమయాన్ని 60 రోజుల నుంచి కేవలం 12 రోజులకు తగ్గించగలిగారు. ఇక పెన్షన్ సంస్కరణల విషయానికి వస్తే 2024 ఒక్క సంవత్సరంలోనే 40 లక్షల మంది పెన్షనర్లు ముఖ గుర్తింపు ఆధారిత డిజిటల్ లైఫ్ ధ్రువీకరణ పత్రాలను ఉపయోగించుకోగా, మొత్తం మీద ఈ డిజిటల్ ధ్రువీకరణ పత్రాల వినియోగం భారీ స్థాయికి చేరుకుంది.

కేంద్ర సిబ్బంది, ప్రజా ఫిర్యాదులు, పెన్షన్ల శాఖ సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ 18వ సివిల్ సర్వీసుల దినోత్సవం సందర్భంగా ప్రసంగిస్తూ ఆసక్తికరమైన గణాంకాలను వెల్లడించారు. దేశంలో ప్రస్తుతం పాలన 'ప్రజలే కేంద్రంగా, వ్యవస్థాగత పద్ధతుల్లో' సాగుతోందని పేర్కొన్నారు. ప్రభుత్వ సేవలను ప్రజలకు అందించే విధానంలో తీసుకొచ్చిన సంస్కరణలను ఆయన వివరించారు. మిషన్ కర్మయోగి వంటి సామర్థ్య పెంపుదల కార్యక్రమాల విస్తరణను, అందులోని కొత్త విభాగాలను ప్రకటించారు. ఇకపై అధికారుల పనితీరును వారి వ్యక్తిగత ప్రొఫైల్ ఆధారంగా కాకుండా, ప్రభుత్వ పథకాల అమలులో వారు సాధించిన ఫలితాలు, పోటీతత్వ ప్రాతిపదికన మూల్యాంకనం చేస్తామని స్పష్టం చేశారు.

పాలనలో వస్తున్న కీలక మార్పులను కేంద్రమంత్రి వివరించారు. వ్యక్తులపై ఆధారపడే విధానం నుంచి ప్రభుత్వం వ్యవస్థాగతమైన పనితీరు వైపు, అలాగే కేవలం నిబంధనలకే పరిమితం కాకుండా బాధ్యతలకు ప్రాధాన్యతనిచ్చే రూల్ బేస్డ్ (హోదా ఆధారంగా) పరిపాలన వైపు మళ్లుతోందని మంత్రి పేర్కొన్నారు. ఇందులో భాగంగా సుమారు 2,000 పాత నిబంధనలను రద్దు చేయడం, కొన్ని ఉద్యోగాలకు ఇంటర్వ్యూలను తొలగించడం, సివిల్ సర్వీసుల దినోత్సవాన్ని జ్ఞానాన్ని పంచుకునే వేదికగా మార్చడం వంటి చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ప్రభుత్వ అవార్డుల ఎంపికలో అధికారుల వ్యక్తిగత ప్రొఫైల్ కంటే పథకాల అమలు తీరుకే ప్రాధాన్యత ఇస్తున్నామని, సహాయ కార్యదర్శి కార్యక్రమం వంటి సంస్థాగత ఆవిష్కరణలు, దాదాపు 90 శాతం ప్రభుత్వ కార్యాక్రమాలను నిర్వహించే డిజిటల్ పాలన వ్యవస్థలు, అంతర్జాతీయ పరిపాలనా వేదికలకు ఆతిథ్యం ఇవ్వడం వంటి అంతర్జాతీయ సహకారాల గురించి ప్రస్తావించారు.

భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని డాక్టర్ జితేంద్ర సింగ్ మాట్లాడుతూ.. మిషన్ కర్మయోగి, "కర్మయోగి ప్రారంభ్" వంటి కార్యక్రమాల ద్వారా శిక్షణ, పాలనా సంస్కరణలను మరింత విస్తరిస్తామని పేర్కొన్నారు. మారుతున్న సవాళ్లకు అనుగుణంగా సివిల్ అధికారులను సిద్ధం చేయడమే దీని లక్ష్యమని తెలిపారు. ప్రస్తుతం దేశ పాలనా నమూనాలపై ప్రపంచవ్యాప్తంగా ఆసక్తి పెరుగుతోందని, ముఖ్యంగా మాల్దీవులు, మారిషస్, బంగ్లాదేశ్, దక్షిణాఫ్రికా వంటి దేశాలు మన సీపీజీఆర్ఏఎంఎస్ వంటి వ్యవస్థలను అధ్యయనం చేస్తున్నాయని వివరించారు. ఈ ప్రయత్నాలన్నీ "వికసిత్ భారత్: పౌర-కేంద్రీకృత పాలన, చివరి వ్యక్తి వరకు అభివృద్ధి" అనే నినాదంతో సాగుతున్నాయని, 2047 దేశ స్వాతంత్ర్య శతాబ్ది వేడుకల సమయానికి భావి తరాల అధికారులను అన్ని రకాలుగా సన్నద్ధం చేయడమే తమ ప్రధాన ఉద్దేశమని ఆయన స్పష్టం చేశారు.

డాక్టర్ జితేంద్ర సింగ్ మాట్లాడుతూ.. ప్రస్తుతం పాలన ప్రభుత్వ కేంద్రితంగా లేదని పౌర కేంద్రితంగా మారుతోందని కేంద్రమంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ పేర్కొన్నారు. పారదర్శకతను, జవాబుదారీతనాన్ని పెంపొందించడం, పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయడమే ఈ సంస్కరణల ప్రధాన ఉద్దేశమని అన్నారు. అలాగే ఫిర్యాదుల సంఖ్య పెరగడంపై స్పందిస్తూ.. ఇది ప్రజల్లో పెరుగుతున్న అసంతృప్తికి సంకేతం కాదని, అది ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలపై ప్రజలకు పెరిగిన నమ్మ కానికి నిదర్శనమని తెలిపారు.

డేటా ఆధారిత మూల్యాంకనం, డిజిటల్ పాలన, భారీ స్థాయిలో సామర్థ్య పెంపువంటి అంశాలు ప్రభుత్వ సేవా సంస్కరణలకు కీలకంగా మారుతూ.. దేశ పరిపాలనా వ్యవస్థలో వస్తున్న మార్పులను ప్రతిబింబిస్తున్నాయని అన్నారు.

ఈ కార్యక్రమానికి ఉపరాష్ట్రపతి శ్రీ సీపీ రాధాకృష్ణన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ వేడుకలో ప్రభుత్వ ఉన్నత స్థాయి పరిపాలనా నాయకత్వానికి చెందిన ప్రముఖులు పాల్గొన్నారు. ప్రధానమంత్రి ముఖ్య కార్యదర్శి పీకే. మిశ్రా, ప్రధానమంత్రి ముఖ్య కార్యదర్శి శక్తికాంత దాస్, మంత్రివర్గ కార్యదర్శి టీవీ సోమనాథన్, డీఏఆర్‌పీజీ కార్యదర్శి శ్రీమతి నివేదిత శుక్లా వర్మ వంటి ఉన్నతాధికారులందరూ హాజరవ్వడం ఈ కార్యక్రమ ప్రాముఖ్యతను చాటిచెప్పింది.

# రక్షణ పరిశ్రమ సహకార ప్రణాళిక, యూఎన్ శాంతి పరిరక్షణ శిక్షణలో సహకారానికి భారత్-జర్మనీ మధ్య ఒప్పందం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 23:జర్మనీ దేశంతో వ్యూహాత్మక రక్షణ భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసేందుకు ఏప్రిల్ 22, 2026న బెర్లిన్‌లో జర్మనీ రక్షణ మంత్రి శ్రీ బోరిస్ పిస్టోరియస్‌తో రక్షణ మంత్రి శ్రీ రాజ్‌నాథ్ సింగ్ ద్వైపాక్షిక చర్చలు జరిపారు. ఈ సందర్భంగా ఇద్దరు మంత్రులు ద్వైపాక్షిక భద్రత, రక్షణకు సంబంధించిన అంశాలపై చర్చించారు. ఇందులో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞాన రంగంలో రక్షణ పరికరాల ఉమ్మడి అభివృద్ధి, ఉత్పత్తికి సంబంధించిన ప్రాధాన్యతా అంశాలున్నాయి. వ్యూహాత్మక భాగస్వామ్యంలో కీలక సైనిక సహకారాన్ని మరింత పెంచేందుకు ఇరుదేశాలు నిబద్ధతను స్పష్టం చేశాయి.

ఈ సమావేశంలో రక్షణ పరిశ్రమ సహకార ప్రణాళిక, యూఎన్ శాంతి పరిరక్షణ శిక్షణలో సహకారానికి అమలు ఒప్పందంపై సంతకాలు చేసి, పరస్పరం మార్చుకున్నారు. జర్మనీ పర్యటనను అమితమైన స్నేహం, సమన్వయం, విశ్వాసానికి ప్రతీకగా రక్షణ మంత్రి అభివర్ణించారు. జర్మనీ రక్షణ మంత్రిగా శ్రీ బోరిస్ పిస్టోరియస్ బాధ్యతలు చేపట్టిన తర్వాత ఇరుదేశాల రక్షణ సహకారంలో గణనీయమైన పురోగతి ఉందన్నారు.

ఇటీవల భారత్-ఈయూ మధ్య కుదిరిన భద్రత, రక్షణ భాగస్వామ్యం.. ఉమ్మడి సహకారాన్ని మరింత బలోపేతం చేయటంలో కీలక ముందడుగని శ్రీ రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. ప్రాంతీయ స్థిరత్వాన్ని బలోపేతం చేసేందుకు, ఉమ్మడి సామర్థ్యాలను మెరుగుపరిచేందుకు, భారత్-జర్మనీల మధ్య దీర్ఘకాలిక వ్యూహాత్మక బంధాన్ని మరింత పటిష్ఠం చేసే స్పష్టమైన ఫలితాల కోసం ఈ భాగస్వామ్య వ్యవస్థను ద్వైపాక్షికంగానూ, యూరోపియన్ దేశాల పరిధిలోనూ ఉపయోగించుకోవాలని ఇద్దరు మంత్రులు అంగీకరించారు.

ప్రపంచవ్యాప్తంగా అస్థిర పరిస్థితులు నెలకొన్నప్పటికీ.. భారత్, జర్మనీ దేశాలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు స్థిరత్వాన్ని, బలాన్ని చేకూర్చాయని రక్షణ మంత్రి స్పష్టం చేశారు. ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా, ఏ విధంగా వ్యక్తమైనా ఆ ముప్పును ఖచ్చితంగా ఖండించాలని చెప్పారు. ఎలాంటి మినహాయింపులు, సమర్థనలు లేకుండా ఉగ్రవాదాన్ని నిస్సందేహంగా ఖండించాలని పిలుపునిచ్చారు.

సేవల స్థాయి సిబ్బంది చర్చల వ్యవస్థీకరణ, భవిష్యత్తులో జరగబోయే ద్వైపాక్షిక సైనిక విన్యాసాలను జర్మనీ రక్షణ మంత్రి అభినందించారు. ఈ ఏడాది సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో భారతదేశంలో నిర్వహించనున్న ఎక్స్-తరంగ్ శక్తి తదుపరి ఎడిషన్‌లో జర్మనీ వైమానిక దళం పాల్గొనాలని రక్షణ మంత్రి ఆహ్వానించారు.

ఈ సమావేశానికి ముందు జర్మనీ రక్షణ మంత్రిత్వ శాఖ కార్యాలయానికి చేరుకున్న శ్రీ రాజ్‌నాథ్ సింగ్‌కు గౌరవ వందనంతో ఘన స్వాగతం లభించింది.అంతకు ముందు, బుండెస్వెహర్ స్మారక చిహ్నం వద్ద రక్షణ మంత్రి నివాళులర్పించారు. విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన బుండెస్వెహర్ సిబ్బంది కోసం ఏర్పాటు చేసిన స్మారక చిహ్నమది.భారత్, జర్మనీ వ్యూహాత్మక భాగస్వామ్యానికి 25 ఏళ్లు పూర్తయ్యాయి.

ఇరుదేశాల మధ్య దౌత్య సంబంధాలకు 2026లో 75 ఏళ్లు పూర్తవుతాయి. ద్వైపాక్షిక స్థాయిలో ప్రస్తుతం ఈ బంధం పలు రంగాలకు విస్తరించింది. రక్షణ రంగంలో పాటు వాణిజ్యం, పెట్టుబడి, సాంకేతికత, ఆవిష్కరణలు, అభివృద్ధి సహకారం, స్వచ్ఛ ఇంధనం, ఉన్నత విద్య, సుస్థిర పరిష్కారాలు, సంస్కృతి, ప్రజల మధ్య సంబంధాలు వంటి అనేక రంగాల్లో ఇరుదేశాల మధ్య సన్నిహిత సంబంధాలున్నాయి. ఇది భాగస్వామ్య బలాన్ని, విస్తృతిని తెలియజేయటమే కాక, సామర్థ్యాన్ని, భవిష్యత్తుపై నమ్మకాన్ని చాటిచెబుతుంది.

# కొచ్చిలో మలయాళ చిత్రం అచప్పాస్ ఆల్బమ్ ప్రీమియర్

## కథన వైవిధ్యంపై ఎన్‌ఎఫ్‌డీసీ నిబద్ధతకు నిదర్శనం

న్యూ ఢిల్లీ, ఏప్రిల్ 23:జాతీయ చలనచిత్ర అభివృద్ధి సంస్థ తన తాజా మలయాళ చిత్రం 'అచప్పాస్ ఆల్బమ్' (తాతయ్య ఆల్బమ్) గ్రాండ్ ప్రీమియర్ వేడుకను 2026 ఏప్రిల్ 21న కొచ్చిలో సినీ తారల సమక్షంలో ఘనంగా నిర్వహించింది. 2026 ఏప్రిల్ 24న ఈ చిత్రం దేశవ్యాప్తంగా విడుదల కానున్న నేపథ్యంలో ఈ ప్రీమియర్ షోను ఏర్పాటు చేశారు. ఎన్‌ఎఫ్‌డీసీ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ ప్రకాశ్ మగ్దుమ్, జనరల్ మేనేజర్ (పీ అండ్ డీ) శ్రీ తరుణ్ తరేజాతో పాటు సినీ రంగ దిగ్గజాలు, పలువురు ప్రముఖులు ఈ వేడుకలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ.. "వైవిధ్యభరితమైన సినిమాలను ప్రభావవంతంగా ప్రజల వద్దకు తీసుకెళ్లాలన్న మా లక్ష్యానికి అచప్పాస్ ఆల్బమ్ నిదర్శనం. ఊహాజనితమైన టైమ్ ట్రావెల్ నేపథ్యాన్ని, వివిధ తరాల మధ్య సునిశితమైన భావోద్వేగాలను మేళవించిన ఈ చిత్రం.. అన్ని వయసుల ప్రేక్షకులనూ అలరిస్తుందన్న నమ్మకం మాకుంది. ఇలాంటి అర్థవంతమైన సినిమాలను ప్రోత్సహించేందుకు ఎన్‌ఎఫ్‌డీసీ ఎప్పుడూ సిద్ధంగా ఉంటుంది. భవిష్యత్తులోనూ భారతీయ మూలాల నుంచి వచ్చే ఆసక్తికరమైన కథలకు ప్రోత్సాహాన్ని కొనసాగిస్తాం. తద్వారా సుసంపన్నమైన మన సాంస్కృతిక వైవిధ్యాన్ని అంతర్జాతీయ వేదికపై నిలుపుతాం. దీప్తి పిళ్లై శివన్ తన హృద్యమైన కథను వెండితెరపైకి తేవడంలో ఆమెకు మద్దతుగా నిలిచినందుకు వేం గర్విస్తున్నాం" అని ఎన్‌ఎఫ్‌డీసీ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ ప్రకాశ్ మగ్దుం అన్నారు.

దర్శకురాలు దీప్తి పిళ్లై శివన్, రచయిత సంజీవ్ శివన్, ప్రధాన నటులు ప్రియాంకా నాయర్, అంజనా అప్పుకుట్టన్, సుధాంశు సంజీవ్ శివన్ తదితరులతో కూడిన సినిమా క్రియేటివ్ బృందం ఈ ప్రీమియర్ వేడుకలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. వీరితోపాటు చిత్రంలోని బాలనటులు, ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

డ్రీమ్ బిగ్ ఫిల్మ్స్ డిస్ట్రిబ్యూటర్ శ్రీ సుజిత్ నాయర్ కూడా ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. సినీ బృందంతో కలిసి ప్రత్యేక ప్రదర్శనలో పాల్గొన్నారు.

ఎన్‌ఎఫ్‌డీసీ నిర్మించిన ఈ చిత్రం.. తిరిగి గతంలోకి వెళ్లాలన్న మానవ సహజమైన ఆసక్తి నేపథ్యంలో సాగుతుంది. 2026 ఏప్రిల్ 24న దేశవ్యాప్తంగా థియేటర్లలో విడుదలకు సిద్ధమైంది.

భారతీయ సినిమా అభివృద్ధికి సంబంధించి అత్యున్నత సంస్థ జాతీయ చలనచిత్ర అభివృద్ధి సంస్థ (ఎన్‌ఎఫ్‌డీసీ). 1975లో దీనిని నెలకొల్పారు. సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ నేతృత్వంలో పనిచేస్తుంది. వివిధ భారతీయ భాషల చిత్రాల నిర్మాణం, ప్రచారం నుంచి దానిని భద్రపరచడం వరకు మొత్తం చలనచిత్ర నిర్మాణ వ్యవస్థకు ఇది దన్నుగా నిలుస్తుంది.

# కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటాం

## -బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు చందుపట్ల కీర్తి రెడ్డి




నల్గొండ, ఏప్రిల్ 23:కార్యకర్తల కుటుంబాల కష్టసుఖాల్లో బిజెపి పార్టీ ఎల్లప్పుడు అండగా ఉంటుందనిబిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు చందుపట్ల కీర్తి రెడ్డి , అన్నారు. గురువారం మండల కేంద్రంలో బుర్ర అరవింద్-భార్గవి కూతురు అనుష్క మొదటి పుట్టినరోజు వేడుకలకు కీర్తి రెడ్డి హాజరై చిన్నారి ని ఆశీర్వదించారు. ఆరోగ్యంగా, ఆనందంగా ఎదిగి ఉన్నత స్థాయిలో రాణించాలని, ఆకాంక్షించారు. కార్యక్రమంలో బీజేపీ చిట్యాల మండలాధ్యక్షుడు బుర్ర వెంకటేష్ గౌడ్, బీజేవైఎం నాయకులు గాలీఫ్, గజానాల రవీందర్, చింతల రాజేందర్, రాయిని శ్రీనివాస్, వల్లల ప్రవీణ్, కేంసారపు ప్రభాకర్, సోషల్ మీడియా కన్వీనర్ ఎర్ర రాకేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే బుర్ర అరవింద్ - భార్గవి కుమార్తె బుర్ర అనుష్కమొదటి పుట్టినరోజు వేడుకలో బి ఆర్ఎస్ యూత్ మండల అధ్యక్షుడు, చిట్యాల గ్రామపంచాయతీ 4వ వార్డు సభ్యుడు తౌటం నవీన్ పాల్గొని ఆశీర్వదించారు . ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు పాంద్రాల వీరస్వామి,కొత్తకొండ సతీష్, బుర్ర రాహుల్ పాల్గొన్నారు.


# యువతకు ఉత్తమ క్రీడా వేదికగా ఎన్టీఆర్ స్టేడియం

## ఎన్టీఆర్ స్టేడియం అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే వంశీకృష్ణ సమీక్ష

అమరావతి, ఏప్రిల్ 23:అచ్చంపేట పట్టణంలోని ఎన్టీఆర్ స్టేడియం అభివృద్ధి పనుల పురోగతిపై ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ సమీక్ష సమావేశం నిర్వహించారు. మున్సిపాలిటీ ఈఈ, డీఈ, ఏఈ అధికారులతో కలిసి జరిగిన ఈ సమావేశంలో స్టేడియం అభివృద్ధికి సంబంధించిన ప్రస్తుత పనులపై సమగ్రంగా చర్చించారు.

అధికారులు పనుల పురోగతిని వివరించగా, మౌలిక వసతుల మెరుగుదల, క్రీడాకారులకు అవసరమైన సదుపాయాల కల్పన, మైదానం స్థాయి పెంపు, ప్రేక్షకుల కోసం సౌకర్యాల విస్తరణ వంటి అంశాలపై ఎమ్మెల్యే దిశానిర్దేశం చేశారు. స్టేడియం అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేసి, యువతకు ఉత్తమ క్రీడా వేదికగా తీర్చిదిద్దాలని ఆయన సూచించారు.

పనుల్లో ఎటువంటి ఆలస్యం లేకుండా నాణ్యతకు ప్రాధాన్యత ఇస్తూ పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సమావేశంలో మున్సిపల్ అధికారులు, ఇంజినీరింగ్ విభాగం సిబ్బంది, సంబంధిత శాఖల ప్రతినిధులు పాల్గొన్నారు.



# విధాన సంస్కరణలు, పరిశ్రమ మద్దతుతో ప్రపంచంలో పవన ఇంధన తయారీ కూడలిగా పటిష్ఠ స్థితికి చేరుకోనున్న భారత్: శ్రీ జోషీ

న్యూ ఢిల్లీ, ఏప్రిల్ 23:విండ్ ఇండిపెండెంట్ పవర్ ప్రొడ్యూసర్స్ అసోసియేషన్ (డబ్ల్యూఐపీపీఏ) స్థాపక దినోత్సవం ఈ రోజు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఒక కార్యక్రమంలో కేంద్ర నూతన, పునరుత్పాదక ఇంధనం, వినియోగదారు వ్యవహారాలు, ఆహారం, ప్రజా పంపిణీ శాఖ మంత్రి శ్రీ ప్రహ్లాద్ జోషీ ప్రసంగిస్తూ, పవన ఇంధన రంగంలో భారత్ చెప్పుకోదగిన ప్రగతిని సాధించినట్లు తెలిపారు. స్వచ్ఛ ఇంధన వినియోగం దిశగా దేశం వేగంగా పయనించేలా చూసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి పునరుద్ఘాటించారు.

పవన ఇంధన సామర్థ్యాన్ని పెంచుకొనే విషయంలో భారత్ ఇప్పటి వరకూ తన అతి శ్రేష్ఠమైన పనితీరును కనబరిచిందని శ్రీ జోషీ తెలిపారు. ఈ క్రమంలో 2025-26లో చరిత్రాత్మక రీతిలో 6.1 గిగావాట్ల (జీడబ్ల్యూ) సామర్థ్యాన్ని జోడించారని ఆయన వివరించారు. పవన ఇంధన రంగంలో భారత్ ప్రస్తుతం ప్రపంచంలో నాలుగో స్థానంలో నిలిచిందనీ, దీని స్థాపక సామర్థ్యం 56.1 జీడబ్ల్యూకు మించిందనీ, మరో 28 గిగావాట్ల సామర్థ్యాన్ని జోడించే పనులు పురోగమిస్తున్నాయన్నారు.

పవన ఇంధన రంగంలో అపార అవకాశాలు ఉన్నాయని మంత్రి చెబుతూ, 150 మీటర్ల ఎత్తులో భారత పవన ఇంధన సామర్థ్యం దాదాపుగా 1164 గిగావాట్లు (జీడబ్ల్యూ)గా ఉండవచ్చని అంచనా వేశారన్నారు. నిరంతర ప్రయత్నాలతో, దేశం 2030 కల్లా 100 గిగావాట్లనూ, 2036కల్లా 156 గిగావాట్ల పవన ఇంధన ఉత్పాదకత సామర్థ్యాన్ని చేజిక్కించుకోగలదనీ, ఇది 2070 నాటికి నెట్-జీరో లక్ష్యాన్ని సాధించడంలో గొప్ప తోడ్పాటును అందించగలుగుతుందన్న నమ్మకాన్ని ఆయన వ్యక్తం చేశారు.

భారత ఇంధన వ్యవస్థను స్థిరీకరించడంలో పవన ఇంధనం ఒక కీలక పాత్రను పోషిస్తోందని మంత్రి స్పష్టం చేశారు. మరీ ముఖ్యంగా సాయంత్రం పూటా, రాత్రుళ్లూ ఉత్పాదకత బాగా ఎక్కువగా ఉంటోందని తెలిపారు. దేశంలో విద్యుత్తుకు గిరాకీ అధికంగా ఉండేది కూడా ఈ సమయాలే. గిరాకీ అత్యంత అధికంగా ఉన్న కాలంలోనే పవన ఇంధన ఉత్పాదకతలో దాదాపు 45 శాతం ఉత్పాదకత నమోదు అవుతోందనీ, ఈ అంశం దీనిని (పవన ఇంధనాన్ని) సౌర ఇంధనానికొక కీలకమైన పూరక ఇంధన వనరుగా మారుస్తోందన్నారు.

విధానపరమైన ఆలోచనలను శ్రీ జోషీ వివరిస్తూ, డిమాండు నిరంతరంగా ఉండేటట్లు చూడడానికి 'పునరుత్పాదక కొనుగోలు బాధ్యతల'లో భాగంగా ఒక ప్రత్యేక 'పవన ఇంధన విభాగాన్ని' ప్రభుత్వం ప్రారంభించిందన్నారు. 'ఆలస్య చెల్లింపునకు సర్‌చార్జ్' నియమావళిని అమలు చేయడం, పారదర్శకతతో కూడిన వేలానికి సంబంధించిన మార్గదర్శకాలు, వీటితో పాటు మోడళ్లు, తయారీదారు సంస్థల ఆమోదిత జాబితా (అప్రూవ్డ్ లిస్ట్ ఆఫ్ మోడల్స్ అండ్ మాన్యుఫాక్చరర్స్.. ఏఎల్ఎమ్ఎమ్)ను అమల్లోకి తీసుకురావడం వంటి ఆలోచనలతో పెట్టుబడిదారుల్లో నమ్మకాన్ని పెంపొందిస్తున్నాయనీ, దేశీయ తయారీకి ప్రోత్సాహం లభిస్తోందనీ ఆయన వివరించారు.

భారత్ 24 గిగావాట్ల కన్నా ఎక్కువ వార్షిక సామర్థ్యం కలిగిన పటిష్ఠ స్వదేశీ తయారీ అనుబంధ విస్తారిత వ్యవస్థను అభివృద్ధి చేసిందనీ, దీనిలో స్వదేశీకరణ స్థాయి 70 నుంచి 80 శాతం స్థాయికి చేరుకొందనీ మంత్రి తెలిపారు. బ్లేడ్లు, టవర్లు, గేర్‌బాక్సులు, తదితర కీలక భాగాల (కాంపొనెంట్స్) కోసం ఒక బలమైన సరఫరా వ్యవస్థను కూడా భారత్ సమకూర్చుకొందన్నారు.

పరిశ్రమ ఎదుర్కొంటున్న సమస్యల్ని గురించి మంత్రి మాట్లాడుతూ, ప్రభుత్వం అదనపు పవన ఇంధన టెండర్లను జారీ చేసే అంశాన్ని పరిశీలిస్తోందన్నారు. దీంతో పాటు, గ్రిడ్ సామర్థ్యాన్ని పెంచడానికి హైబ్రిడ్ పథకాల్నీ, 24 గంటలూ అమలయ్యే (రౌండ్ ది క్లాక్.. ఆర్‌టీసీ) పథకాల్నీ ప్రోత్సహిస్తోందని కూడా ఆయన తెలిపారు. డీవియేషన్ సెటిల్‌మెంట్ మెకానిజం (డీఎస్ఎమ్)కు సంబంధించిన జరిమానాలు, విద్యుత్తు కోత, సరఫరాలో జాప్యాల వంటి సమస్యలు పరిశీలనలో ఉన్నాయనీ, ఈ సమస్యలకు సమతౌల్య, ఆచరణీయ పరిష్కారాలను వెదకే దిశగా ప్రయత్నాలు చేస్తున్నారన్నారు.

పరిశ్రమలు నేరుగా పునరుత్పాదక విద్యుత్తును కొనుగోలు చేసేందుకు వీలుగా 'గ్రీన్ ఎనర్జీ ఓపెన్ యాక్సెస్' నియమాలు, పాత విండ్ టర్బైన్లను మళ్లీ బలోపేతం చేయడం, గ్రీన్ ఎనర్జీ కారిడార్లో భాగంగా సరఫరా సంబంధిత మౌలిక సదుపాయాల్ని విస్తరించడం వంటి కార్యక్రమాల్ని అమలుచేస్తున్నట్లు మంత్రి ప్రస్తావించారు.

బ్లెండెడ్ ఫైనాన్స్, రుణ పెంపు ప్రణాళికల వంటి వినూత్న యంత్రాంగాల ద్వారా దీర్ఘకాలిక ప్రాతిపదికన, తక్కువ ఖర్చుతో ధనాన్ని సమీకరించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఆయన వెల్లడించారు. 'కాంట్రాక్ట్స్ ఫర్ డిఫరెన్స్' (సీఎఫ్‌డీ) నమూనాలో భాగంగా ఇటీవలే మొదలుపెట్టిన 500 మెగావాట్ల పథకంతో ఆదాయంలో ఖచ్చితత్వం నెలకొనడంతో పాటు, మార్కెట్టు స్థిరత్వం కూడా మెరుగుపడగలదన్న అంచనాలు ఏర్పడ్డాయి.

మారుతున్న ప్రపంచ ముఖ చిత్రం భారత్‌కు వ్యూహాత్మక అవకాశాన్ని ప్రసాదిస్తోందని శ్రీ జోషీ అభిప్రాయపడ్డారు. ఈ అవకాశాన్ని వినియోగించుకొంటూ దేశం పవన ఇంధన రంగంలో నమ్మదగిన ప్రపంచ స్థాయి తయారీ, సరఫరా ప్రక్రియల భాగ స్వామిగా పేరు తెచ్చుకోగలదనీ, ప్రత్యేకించి వివిధ దేశాలు తమ సరఫరా వ్యవస్థల్లో వైవిధ్యాన్ని తీసుకువచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్న ప్రస్తుత కాలంలో ఇలాంటి పరిణామం చోటు చేసుకోవచ్చనీ శ్రీ జోషీ వివరించారు.

పవన ఇంధన పరిశ్రమకు ఒక విశ్వసనీయ గొంతును అందిస్తున్న విండ్ ఇండిపెండెంట్ పవర్ ప్రొడ్యూసర్స్ అసోసియేషన్ (డబ్ల్యూఐపీపీఏ)ను మంత్రి అభినందించారు. విధానపరమైన చర్చలను సాకారం చేయడంలో, క్షేత్ర సంబంధిత సవాళ్లను పరిష్కరించడంలో, భారత పునరుత్పాదక ఇంధన రంగ మహత్వాకాంక్షలకు మద్దతునివ్వడంలో ఈ సంఘం కీలక పాత్రను పోషించిందని ఆయన అన్నారు.

వచ్చే పదేళ్లలో 156 జీడబ్ల్యూ ప్రతిష్ఠాత్మక లక్ష్యాన్ని సాధించడం సాధ్యమేనని మంత్రి తన ప్రసంగం ముగింపులో వ్యాఖ్యానించారు. విధాన రూపకల్పన పరంగా స్పష్టమైన దిశానిర్దేశం, బలమైన సంస్థాగత సహకారంతోపాటు పరిశ్రమ భాగస్వామ్యం ఈ లక్ష్య సాధనకు మద్దతును అందిస్తున్నాయని ఆయన చెప్పారు. విశ్వసనీయమైన, మన్నిక కలిగిన ఇంధన భవిష్యత్తును నిర్ధారించడానికి పవన, సౌర, నిల్వ సామర్థ్యాల మిశ్రణంతో ఏకీకృత హైబ్రిడ్ వ్యవస్థల రూపకల్పనపై దృష్టిని కేంద్రీకరించాల్సిందిగా ఆయన పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో నూతన, పునరుత్పాదక ఇంధన శాఖ కార్యదర్శి శ్రీ సంతోష్ సారంగీతో పాటు ఇతరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ ఉద్యోగులకు అండగా బీఆర్ఎస్ పార్టీ..

## వారి డిమాండ్స్ న్యాయమైనవి : తలసాని శ్రీనివాస్ యాదవ్



హైదరాబాద్, ఏప్రిల్ 23: ఆర్టీసీని ప్రయివేట్ పరం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రలు చేస్తుందని మాజీమంత్రి, బీఆర్ ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. గురువారం సికింద్రాబాద్ లోని రాణిగంజ్ డిపో వద్ద ఆర్టీసీ కార్మికులు నిర్వహించిన మహాధర్నాకు ఆయన హాజరై సమ్మెకు మద్దతు తెలిపారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 92 సంవత్సరాల ఘన చరిత్ర కలిగిన ఆర్టీసీ మనుగడను ప్రశ్నార్థకంగా మార్చేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తుందని మండిపడ్డారు. సురక్షిత ప్రయాణానికి ప్రత్యేక గుర్తింపు పొందిన ఆర్టీసీ వేలాదిమంది ఉద్యోగుల శ్రమ, కృషి ఎంతో ఉందన్నారు. ఆర్టీసీ ఉద్యోగుల డిమాండ్ లు న్యాయమైనవని, వాటిని పరిష్కరించి సమ్మెను విరమింప చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని స్పష్టం చేశారు.

తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమం లో ఆర్టీసీ ఉద్యోగుల పాత్ర ఎనలేనిదని పేర్కొన్నారు. సమస్యల పరిష్కారం అయ్యే వరకు ఆర్టీసి ఉద్యోగులకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఎలెక్ట్రికల్ బస్సులను తీసుకొచ్చి ఉద్యోగ భద్రత లేకుండా చేస్తుందని మండిపడ్డారు. ఎలెక్ట్రికల్ బస్సులను ఆర్టీసీ ఉద్యోగులతో నడిపించాలని డిమాండ్ చేశారు. ఇతర రాష్ట్రాలకు చెందిన వ్యక్తులను డ్రైవర్లుగా పెట్టి ఎలెక్ట్రికల్ బస్సులను ఎలా నడుపుతారని ప్రశ్నించారు.

ఇంతలోనే కాంగ్రెస్ ప్రభుత్వం..

తెలంగాణ ప్రాంత ఉద్యోగుల ఉపాధిని దెబ్బతీయుడానికా తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకుంది..? అని తలసాని ప్రశ్నించారు. నగరంలోని రాణిగంజ్, గౌలిగూడ తదితర 5 ఆర్టీసీ డిపోలను ఎలెక్ట్రికల్ బస్సులకు చెందిన ప్రయివేట్ సంస్థలకు అప్పగించారని, ఎవడబ్బ సొమ్మని ప్రయివేట్ సంస్థలకు ఆర్టీసీ ఆస్తులను ధారాదత్తం చేస్తారని ధ్వజమెత్తారు. ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వం లో విలీనం చేయాలని కేసీఆర్ ప్రభుత్వం క్యాబినెట్ లో తీర్మానించి గవర్నర్ కు పంపించడం జరిగిందని తెలిపారు. ఇంతలోనే కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిందని, ఖచ్చితంగా ప్రభుత్వం లో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్ లో ఉన్న రెండు పీఆర్సీ లను వెంటనే అమలు చేయాలన్నారు. రిటైర్ ఉద్యోగుల బకాయిలను కూడా వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.

ఆర్టీసీ ఉద్యోగులకు టార్గెట్ లు పెడుతూ ఇబ్బందులకు గురి చేస్తున్న ప్రభుత్వం ఎలెక్ట్రికల్ బస్సుల నిర్వాహకులకు ప్యాసెంజర్లు లేకున్నా కిలో మీటర్ కు 56 రూపాయలు చొప్పున ఎలా చెల్లిస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్టీసీ ఉద్యోగుల 32 డిమాండ్లలో 29 ఆమోదించామని ప్రభుత్వం తప్పుడు ప్రచారం చేయడం మాని ఆమోదించిన 29 డిమాండ్స్ ఏమిటో మీడియా ముఖంగా బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ పార్టీ ప్రోద్బలంతో నే ఆర్టీసీ ఉద్యోగులు సమ్మె చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ మంత్రులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని, అలా మాట్లాడటానికి సిగ్గు ఉండాలని మండిపడ్డారు.

ఎన్నికల మేనిఫెస్టో లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలనే ఆర్టీసీ ఉద్యోగులు ప్రభుత్వాన్ని అడుగుతున్నారని అన్నారు. తెలంగాణ ఉద్యమ స్ఫూర్తితో సమస్యలు పరిష్కారం అయ్యే వరకు పోరాడాలని, మీ వెంట మేమున్నాం అని భరోసా ఇచ్చారు. ధర్నాలో ఎమ్మెల్యే వెంట ఆర్టీసీ బీసీ ఉద్యోగుల హైదరాబాద్ రీజియన్ గౌరవ అధ్యక్షుడు గుర్రం పవన్ కుమార్ గౌడ్, డిపో గౌరవ అధ్యక్షుడు కోటేశ్వర్ గౌడ్, యూనియన్ నాయకులు సంపత్, రాజయ్య నాయర్, సురేష్, స్వరూప, పలువురు బి ఆర్ ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# 'ముండియల్ డో కీజో డో బ్రెజిల్ 2026'లో భారతీయ జున్ను తయారీదారులు సాధించిన విజయం పట్ల అభినందనలు తెలియజేసిన ప్రధాని

న్యూ ఢిల్లీ, ఏప్రిల్ 23:జున్ను, పాడి ఉత్పత్తులకు సంబంధించి జరిగే ప్రతిష్టాత్మక అంతర్జాతీయ పోటీ 'ముండియల్ డో కీజో డో బ్రెజిల్ 2026'లో భారతీయ జున్ను తయారీదారులు సాధించిన విజయం పట్ల ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ అభినందనలు తెలిపారు. ఇందులో 1 సూపర్ స్వర్ణం, 2 స్వర్ణం, 1 రజతంతో సహా మొత్తం నాలుగు భారతీయ ఉత్పత్తులు పతకాలను గెలుచుకున్నాయి.

''సూపర్ స్వర్ణాన్ని ఎలెఫ్తేరియా గుల్మార్గ్ (బ్రీ స్టైల్) గెలుచుకోగా.. యాక్ చుర్పి-సాఫ్ట్ (నార్డిక్ ఫార్మ్, లేహ్, లడఖ్), ఎలెఫ్తేరియా బ్రునోస్ట్ (వే చీజ్) స్వర్ణ పతాకాలను సాధించాయి. అలాగే ఎలెఫ్తేరియా కాళీ మిరి (బెల్పార్ నోల్ స్టైల్) రజతాన్ని కైవసం చేసుకుంది" అని ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ పేర్కొన్నారు.


మౌసం నారంగ్, తెన్లే నూర్బుతో సహా అవార్డు విజేతల కృషిని ప్రధానమంత్రి ప్రశంసించారు. ఇటువంటి విజయాలు భారతదేశపు సంప్రదాయ పాడి పరిశ్రమకు ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న గుర్తింపును ప్రతిబింబిస్తాయని ఆయన అన్నారు.

జున్ను, పాడి ఉత్పత్తుల విషయంలో జరిగే ప్రతిష్టాత్మక అంతర్జాతీయ పోటీ 'ముండియల్ డో కీజో డో బ్రెజిల్ 2026'లో భారత్ అద్భుతమైన ఆరంగేట్రం చేసింది. ఇందులో 1 సూపర్ స్వర్ణం, 2 స్వర్ణం, 1 రజతంతో సహా మొత్తం నాలుగు భారతీయ ఉత్పత్తులు పతకాలను కైవసం చేసుకున్నాయి.

సూపర్ స్వర్ణాన్ని ఎలెఫ్తేరియా గుల్మార్గ్ (బ్రీ స్టైల్) గెలుచుకోగా.. యాక్ చుర్పి-సాఫ్ట్ (నార్డిక్ ఫార్మ్, లేహ్, లడఖ్), ఎలెఫ్తేరియా బ్రునోస్ట్ (వే చీజ్) స్వర్ణ పతాకాలను సాధించాయి. అలాగే ఎలెఫ్తేరియా కాళీ మిరి (బెల్పార్ నోల్ స్టైల్) రజతాన్ని కైవసం చేసుకుంది.

ఇటువంటి విజయాలు ప్రపంచ వేదికపై భారతదేశపు సంప్రదాయ పాడి పరిశ్రమను బలోపేతం చేస్తాయి.

# ఎలాంటి కోతలు లేకుండా ధాన్యం కొనుగోళ్లు : ఎమ్మెల్యే విజయ రమణారావు



కరీంనగర్, ఏప్రిల్ 23: ఎలాంటి కోతలు లేకుండా ధాన్యం కొనుగోలు చేస్తామని ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. కాల్వశ్రీరాంపూర్, పెగడపల్లి, మడిపల్లి కాలనీ, తారుపల్లి, మీర్జంపేట, లక్ష్మీపురం, పందిల్ల, గంగారం, ఇప్పలపల్లి గ్రామాల్లో సహకార సంఘం, సెర్ప్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తూకంలో ఎలాంటి కటింగ్ లు చేసినా సహించేది లేదని అధికారులను హెచ్చరించారు. తూకం అయిన వెంటనే రైతులకు రశీదులు ఇవ్వాలని ఆదేశించారు. గతంలో కొనుగోలు చేసిన విదంగానే ఈసారి కూడా రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూస్తామన్నారు కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ రామిడి తిరుపతిరెడ్డి, సహకార సంఘం ప్రత్యేకాధికారి సురేందర్రెడ్డి, మానిటరింగ్ ఆఫీసర్ ఇమ్రాన్ఖాన్, మార్కెట్ కార్యదర్శి ప్రేమ్ కుమార్, ఏపీఎం లవకుమార్, మాజీ ఎంపీపీ గోపగాని సారయ్య గౌడ్, సీఈవో కోలేటి శ్రీనివాస్, ఆయా గ్రామాల సర్పంచులు, ఆయా శాఖల అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# 'కార్మికుల పట్ల ఐటీసీ యాజమాన్యం నిర్లక్ష్య వైఖరి విడనాడాలి'

ఖమ్మం, ఏప్రిల్ 23: ఐటీసీ యాజమాన్యం కార్మికుల పట్ల నిర్లక్ష్య వైఖరి విడనాడి అపరిష్కృత సమస్యలు పరిష్కరించాలని, వేతన ఒప్పంద పెండింగ్ సమస్యలు తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కార్మిక జేఏసీ కన్వీనర్, బీఆర్టీయూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు సానికొమ్ము శంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఐటీసీ కర్మాగారంలో అడ్మిన్ బ్లాక్ వద్ద కార్మికులు మూతికి నల్ల మాస్కులు ధరించి పెద్ద ఎత్తున మౌన ప్రదర్శన నిర్వహించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 13వ వేతన ఒప్పంద పెండింగ్ సమస్యలు అలాగే ఉన్నాయని, 14వ వేతన ఒప్పందంలో జాప్యం జరుగుతుందని దీనికి ఐటీసీ యాజమాన్యం, గుర్తింపు సంఘం నిర్లక్ష్య వైఖరే కారణమన్నారు. త్వరితగతిన కార్మికులకు రూ.22 వేల వేతన ప్యాకేజీ, వందశాతం అన్లిమిటెడ్ మెడికల్, బదిలీలందరినీ రెగ్యులర్ చేయడంతో పాటు కాంట్రాక్టు కార్మికులకు ఆమోదయోగ్యమైన వేతన సదుపాయం కల్పించాలని తదితర అంశాలపై కార్మికులు నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు.

గుర్తింపు సంఘంతో పాటు ఐటీసీ యాజమాన్యం కార్మికులకు మంచి వేతన ఒప్పందం చేయకపోతే కార్మిక జేఏసీ ముున్ముందు తీసుకునే నిర్ణయాలకు యాజమాన్యం, గుర్తింపు సంఘాలు బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. రాబోయే కాలంలో కార్మిక జేఏసీ సమస్యల పరిష్కారం కోసం పోరాటం మరింత ఉధృతం చేస్తుందని, ఇప్పటికైనా కార్మికుల సమస్యలు పరిష్కరించి వేతన ఒప్పందంలో మెరుగైన ప్యాకేజీ తీసుకురావాలని, లేనిపక్షంలో జేఏసీతో కలిసివస్తే మంచి వేతన ఒప్పందం చేయడానికి సహకారం అందిస్తామన్నారు. ఈ మౌన ప్రదర్శనకు పెద్ద సంఖ్యలో కార్మికులు, కాంట్రాక్టు కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# తెలంగాణ భవిష్యత్ కాపాడటమే కేసీఆర్ లక్ష్యం : మాజీ మంత్రి జీవన్ రెడ్డి




సిరిసిల్ల, ఏప్రిల్ 23: కుట్రలు, కుతంత్రాలతో పాలన కొనసాగిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం నుంచి తెలంగాణ భవిష్యత్‌ను కాపాడటమే కేసీఆర్ లక్ష్యమని బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి జీవన్ రెడ్డి అన్నారు. సిరిసిల్ల బీఆర్ఎస్ కార్యాలయంలో బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.తెలంగాణ సమాచారం

ఇటీవల జరిగిన జగిత్యాల సభ తెలంగాణ సమాజానికి దిక్సూచిగా నిలిచిందని పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి పోవాలె కేసీఆర్ రావాలేనని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు యావత్ తెలంగాణ ప్రజలకు జీవధార అని వెల్లడించారు. హైకోర్టు తీర్పు రేవంత్ రెడ్డికి చెంప పెట్టు అని వివరించారు. కేసీఆర్, హరీష్ రావు, అధికారులను కేసులో ఇరికించాలని చేసిన కుట్రలు పటాపంచలయ్యాయని అన్నారు.

ప్రతి రోజు రేవంత్ రెడ్డికి కలలో కేసీఆర్ కనపడుతున్నాడని తెలిపారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు తోట ఆగయ్య, మండల పార్టీ అధ్యక్షులు, పట్టణ అధ్యక్షులు, గ్రామ శాఖ అధ్యక్షులు, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# బుద్ధా వెంకన్నని కలిసిన 50వ డివిజన్ టీడీపీ కమిటీ

నల్గొండ, ఏప్రిల్ 23:తెలుగుదేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షులుగా నియమితులైన బుద్ధా వెంకన్నని 50వ డివిజన్ అధ్యక్షులు కుప్పుల అరుణ శ్రీ గంగాధర్ ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలసి శాలువా కప్పి గజమాలతో సత్కరించి, ప్రశంసా పత్రంతో అభినందనలు తెలిపిన 50వ డివిజన్ టిడిపి కుటుంబ సభ్యులు.

ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా బీసీ కార్యదర్శి యాట్ల ప్రసాద్, డివిజన్ ప్రధాన కార్యదర్శి కాళ్ళ ఈశ్వర్, పీత బుజ్జి, వీర్ల వాసు, కోడి కొండా, సోమల పూర్ణ, మువ్వా రామారావు, కొంకి సతీష్,గొల్ల నాగ సత్తి, కొండపు బుజ్జి, మహిళ కార్యకర్తలు ఎస్.కె మోబినా,గొల్ల పావని,నగిరికంటి రమాదేవి,మాధవి,లక్ష్మి తదితరులు పాల్గొన్నారు..

# రైలు మార్గాల ఆధునికీకరణ.. వేగవంతమైన, మరింతగా ఆధారపడదగిన నెట్‌వర్క్‌కు దోహదం.. దీనిపై ఓ వ్యాసాన్ని పంచుకున్న ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 23:రైలు మార్గాల ఆధునికీకరణ వేగవంతమైన, మరింత ఆధారపడదగిన వ్యవస్థకు ఏ విధంగా దోహదం చేస్తోందీ వివరిస్తూ కేంద్ర మంత్రి శ్రీ అశ్వినీ వైష్ణవ్ రాసిన ఒక వ్యాసాన్ని ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ప్రజలతో ఈ రోజు పంచుకున్నారు. రైలు మార్గాలకు కొత్త రూపును ఇవ్వడం, ఆధునిక పరీక్షా విధానం, నిర్వహణ ప్రక్రియలో యంత్రాల సాయాన్ని తీసుకోవడం వంటి చర్యలు రైలు ప్రయాణ నాణ్యతను మెరుగుపరిచి ఇదివరకటితో పోలిస్తే ఎక్కువ వేగంతో రైళ్లు ప్రయాణించగలగడంలో తోడ్పడుతున్నాయని శ్రీ మోదీ వివరించారు.

"ఈ మార్పులు ఆలస్యాలను కుదించి, యాత్రలు సాఫీగా సాగేలా మద్దతివ్వడంతో పాటు దేశవ్యాప్తంగా రోజు రోజుకూ పెరుగుతున్న ప్రయాణికుల, సరకు రవాణా అవసరాలను తీర్చడంలో రైల్వేలకు సాయపడుతున్నాయి'' అని శ్రీ మోదీ అన్నారు.

రైలు పట్టాలను సరికొత్తవిగా తీర్చిదిద్దడం, ఆధునిక పరీక్షా విధానాలను అవలంబించడం, నిర్వహణ కార్యకలాపాల్లో యంత్రాల సాయాన్ని తీసుకోవడం రైలు ప్రయాణ నాణ్యతను మెరుగుపరచడంతో పాటు రైళ్లు మునుపటి కన్నా ఎక్కువ వేగంగా పయనించడానికి తోడ్పడుతున్నాయి. ఈ మార్పులు ఆలస్యాలను కుదిస్తున్నాయి. యాత్రలు సాఫీగా సాగేందుకు దోహదపడుతున్నాయి. దేశమంతటా రోజు రోజుకూ పెరుగుతున్న ప్రయాణికుల, సరకు రవాణా అవసరాలను తీర్చడంలో రైల్వేలకు ఈ మార్పులు సహాయకారిగా ఉంటున్నాయి.

కేంద్ర మంత్రి శ్రీ అశ్వినీ వైష్ణవ్ రాసిన వ్యాసం చదివి తీరాలి" అని పేర్కొన్నారు.

# క్లీన్ ఎనర్జీ ప్లాంట్‌కు శంకుస్థాపన




అమరావతి, ఏప్రిల్ 23:నారా చంద్రబాబు నాయుడు అనకాపల్లి జిల్లాలో అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. రాంబిల్లిలో క్లీన్ ఎనర్జీ ప్రాజెక్ట్‌కు శంకుస్థాపన చేసి, జిల్లా అభివృద్ధిపై విశ్వాసం వ్యక్తం చేశారు.

రాంబిల్లిలో రెన్యూ గ్లోబల్ ఎనర్జీ సంస్థకు చెందిన రూ.5,400 కోట్ల క్లీన్ ఎనర్జీ ప్లాంట్‌కు సీఎం శంకుస్థాపన చేశారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా సుమారు 2,100 మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు.

ఇటీవలే రూ.1.36 లక్షల కోట్లతో ఆర్సెలార్ మిత్తల్ స్టీల్ ప్లాంట్‌కు కూడా శంకుస్థాపన చేసినట్లు గుర్తుచేశారు. భారీ పెట్టుబడులు అనకాపల్లి జిల్లాను దేశంలోనే అగ్రస్థానంలో నిలబెడతాయని సీఎం అభిప్రాయపడ్డారు.

గతంలో వెనుకబడిన జిల్లాగా ఉన్న రంగారెడ్డి జిల్లా ఇప్పుడు దేశంలో ధనిక జిల్లాగా మారిందని ఉదాహరణగా చెప్పారు. అదే తరహాలో అనకాపల్లిని కూడా అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడం తన బాధ్యత అని చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు.

## కృష్ణసాగర్‌లో నర్సరీ, ఉపాధి పనుల పరిశీలన

ఖమ్మం, ఏప్రిల్ 23: బూర్గంపహాడ్ మండల పరిధిలోని కృష్ణసాగర్ గ్రామ పంచాయతీలో జరుగుతున్న ఉపాధి పనులతో పాటు నర్సరీని సర్పంచ్ తాటి వాణి, ఉప సర్పంచ్ మోహన్‌రావు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధి పనులు చేస్తున్న పనుల ప్రదేశం వద్దకు వెళ్లి కూలీలకు మంచినీటి క్యాన్లు, మెడికల్ కిట్లను అందజేశారు. పనుల ప్రదేశంలో వారికి ఎండ తగలకుండా టెంట్లు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాలని ఉపాధి సిబ్బందికి సూచించారు.

అనంతరం గ్రామంలో మొక్కల నర్సరీని సందర్శించి మొక్కలను సంరక్షించి పెంపకంపై జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం కృష్ణసాగర్ ఎస్టీ కాలనీలో ఎంపీపీఎస్ పాఠశాలను సందర్శించి పిల్లలకు నాణ్యమైన విద్యాబోధన చేయాలని హెచ్‌ఎం కోటేశ్వరరావుకు సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నాగిరెడ్డి, పాలకవర్గ సభ్యులు ఉసిల్ల రాజేష్, అంతోటి కృష్ణలీల, బాదావత్ సురేష్, మడకం దేవయ్య, ఫీల్డ్ అసిస్టెంట్ భూక్యా హనుమంతరావు, ఉపాధ్యాయులు భీమయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

# తెలంగాణలో స్థిరంగా కొనసాగుతున్న ఇంధనం, ఎల్పీజీ సరఫరా: ఓఎంసీలు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 23:తెలంగాణలో ప్రస్తుత డిమాండ్‌ను తీర్చేందుకు సరిపడా పెట్రోల్, డీజిల్, ఎల్పీజీ (లిక్విఫైడ్ పెట్రోలియం గ్యాస్) లభిస్తోందని రాష్ట్రంలోని ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు (ఓఎంసీ) తెలియజేశాయి. ఈ ఉత్పత్తుల విషయంలో రాష్ట్రంలో కొరత లేదని అవి స్పష్టం చేశాయి. ప్రభుత్వ రంగ ఓఎంసీలు సరఫరా పరిస్థితిని నిశితంగా పర్యవేక్షిస్తున్నాయని.. .లాజిస్టిక్స్‌ను క్రమబద్ధీకరించటం, పంపిణీని మరింత వేగవంతం చేయడానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నాయని ఒక పత్రికా ప్రకటనలో ఓఎంసీల రాష్ట్ర స్థాయి కోఆర్డినేటర్ తెలిపారు. ఈ నెల మొదటి 20 రోజుల్లో ఓఎంసీల పెట్రోల్, డీజిల్ సరఫరాలో 7 శాతం స్వల్ప వృద్ధి నమోదైంది.

ప్రస్తుతం గృహావసరాల ఎల్పీజీ సిలిండర్ల బుకింగ్‌లు తగుముఖం పట్టాయి. వినియోగదారుల్లో ఎటువంటి ఆందోళన లేదన్న విషయాన్ని ఇది తెలియజేస్తోంది. ఈ నెలలో నిన్నటి వరకు రాష్ట్రంలో మొత్తం 37.77 లక్షల గృహావసరాల ఎల్పీజీ సిలిండర్లను పంపిణీ చేశారు. అంటే ఇది సాధారణ స్థాయిలోనే ఉంది.

ఎల్పీజీ వినియోగదారులు ఎస్ఎంఎస్, మిస్డ్ కాల్స్, ఐవీఆర్ఎస్, ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌ల ద్వారా సిలిండర్లను బుక్ చేసుకోవాలని అధికారులు కోరారు. ఎల్పీజీ సిలిండర్ల అక్రమ తరలింపును అరికట్టడానికి, సరైన లబ్ధిదారులకు సిలిండర్లు అందేలా చూసేందుకు రూపొందించిన ఓటీపీ ఆధారిత డెలివరీ విధానమైన 'డెలివరీ అథెంటికేషన్ కోడ్ (డీఏసీ)' వ్యవస్థను వినియోగదారులు ఆదరించటంతో పాటు ప్రోత్సహించాలని ప్రభుత్వం అభ్యర్థిస్తోంది. అంతేకాకుండా వాణిజ్య ఎల్పీజీ సరఫరా కోసం అన్ని ఓఎంసీలు ప్రత్యేక పోర్టల్‌లను ప్రారంభించాయి. తమ అవసరాలను నమోదు చేసుకోవడానికి ఈ ప్లాట్‌ఫాంను ఉపయోగించాలని వాణిజ్య సంస్థలకు సూచించారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యామ్నాయ వంట ఇంధనంగా పీఎన్‌జీని ప్రోత్సహిస్తున్నాయి. ప్రస్తుతం రాష్ట్రంలో 1.03 లక్షల పీఎన్‌జీ కనెక్షన్లు ఉన్నాయి. హైదరాబాద్, మేడ్చల్, సంగారెడ్డి, చౌటుప్పల్, నల్గొండ, వరంగల్, ఖమ్మం, షాద్‌నగర్, రామగుండం, తెలంగాణలోని ఇతర ఎంపిక చేసిన పట్టణాలలో పీఎన్‌జీ సేవలు అందుబాటులో ఉన్నాయి. పీఎన్‌జీ కనెక్షన్ల కోసం భాగ్యనగర్ గ్యాస్, టొరెంట్ గ్యాస్, మేఘా గ్యాస్ వంటి రాష్ట్రంలోని సీజీడీ సంస్థలను వాణిజ్య సంస్థలు, పరిశ్రమలు సంప్రదించొచ్చు.

రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకు 1,942 దాడులను నిర్వహించి 5,388 సిలిండర్లను స్వాధీనం చేసుకుంది.

స్థానిక చిరునామా ధ్రువీకరణ పత్రం లేని వలస కార్మికులు, విద్యార్థుల కోసం అధీకృత ఓఎంసీ డిస్ట్రిబ్యూటర్ల వద్ద 5 కిలోల ఎఫ్‌టీఎల్ సిలిండర్లు అందుబాటులో ఉన్నాయి. వీటిని పొందేందుకు చెల్లుబాటయ్యే వ్యక్తిగత ధ్రువీకరణ, డిక్లరేషన్ సమర్పించాలి. హైదరాబాద్‌లో 5 కిలోల ఎఫ్‌టీఎల్ సిలిండర్ ధర రూ. 1,547 (కొత్త కనెక్షన్), రీఫిల్ ధర సిలిండర్‌కు రూ. 673గా ఉంది. గ్యాస్ అయిపోయిన తర్వాత అధీకృత డిస్ట్రిబ్యూటర్లు లేదా గ్యాస్ ఏజెన్సీల వద్ద సిలిండర్లను ఇచ్చి మళ్లీ గ్యాస్ నింపుకోవచ్చు.

సామాన్య ప్రజలు అధికారిక సమాచారాన్ని మాత్రమే విశ్వసించాలని... తప్పుడు వార్తలు, వదంతులను నమ్మి మోసపోవద్దని మరోసారి తెలియజేశారు.

# ఉపయోగానికి సిద్ధంగా సుల్తాన్‌పూర్ - పూర్వాంచల్ ఎక్స్‌ప్రెస్ వే - ఈఎల్ఎఫ్

న్యూ ఢిల్లీ, ఏప్రిల్ 23:ఉత్తరప్రదేశ్‌లోని సుల్తాన్‌పూర్ జిల్లాలో పూర్వాంచల్ ఎక్స్‌ప్రెస్ వేపై అత్యవసర ల్యాండింగ్ సౌకర్యాన్ని (ఈఎల్ఎఫ్) భారత వైమానిక దళం ఉపయోగానికి సిద్ధంగా ఉంది. ఏప్రిల్ 22వ తేదీన ఈ మేరకు అవసరమైన పరీక్షలను నిర్వహించారు.

ఈఏఎఫ్ విమానాల అత్యవసర ల్యాండింగ్ విన్యాసాలను వీక్షించేందుకు యూపీ పంచాయతీ రాజ్, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి శ్రీ ఓం ప్రకాశ్ రాజ్‌భర్, సీఏసీ, ఏఓసీ-ఇన్-సీ ఎయిర్ మార్షల్ బి. మణికంఠన్, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు. భారత వైమానిక దళ కార్యాచరణ వైవిధ్యాన్ని జగ్వార్, మిరాజ్-2000, సుఖోయ్-30 ఎంకెఐ, సీ-295, ఏఎన్-32 వంటి భిన్న రకాల విమానాలతో పాటు ఎంఐ-17 వీ5 హెలికాప్టర్, గరుడ్ కమాండో బృందాల ద్వారా ప్రదర్శించింది. ఐఏఎఫ్, యూపీఈఐడీఏ, స్థానిక పౌర పరిపాలన విభాగాలతో కలిసి రాత్రింబవళ్లు సాధ్యమైనంత తక్కువ సమయంలో అత్యవసర ల్యాండింగ్ సౌకర్యాలను అందుబాటులోకి తీసుకువచ్చేలా అవసరమైన ప్రామాణిక కార్యాచరణ విధానాలను విజయవంతంగా పరీక్షించింది.

సాధారణ రన్‌వేలు అందుబాటులో లేనప్పుడు కూడా ఆటంకం లేకుండా కార్యకలాపాలను చేపట్టగల ఐఏఎఫ్ సామర్థ్యాన్ని ఈ ఆపరేషన్ భారీగా పెంచింది. దాని కార్యాచరణ స్థితిస్థాపకతను ప్రదర్శించింది. స్వల్ప వ్యవధిలోనే ఇటువంటి ఎక్స్‌ప్రెస్‌వే ఎయిర్‌స్ట్రిప్‌లను అందు బాటులోకి తీసుకురావటంలో వైమానిక సిబ్బంది వృత్తిపరమైన నైపుణ్యాలను, క్షేత్రస్థాయి సిబ్బంది సామర్థ్యాన్ని ఇది నిరూపించింది. జాతీయ ఎక్స్‌ప్రెస్‌వేలపై వ్యూహాత్మకంగా అభివృద్ధి చేసిన ఈ ఎయిర్‌స్ట్రిప్‌లు అత్యవసర సమయాల్లోనూ కార్యాచరణ సౌలభ్యాన్ని గణనీయంగా పెంచుతాయి. జాతీయ భద్రత, విపత్తు ప్రతిస్పందన సామర్థ్యాలను బలోపేతం చేస్తూ, కీలక బలగాల కోసం ఇవి ఉపయోగపడతాయి.

# అనుమానాస్పద మృతి కేసు నమోదు

అమరావతి, ఏప్రిల్ 23:మాసబ్‌ట్యాంకు ప్రాంతంలో ఏటీఎంలో వ్యక్తి మృతదేహం బయటపడటంతో కలకలం రేగింది. స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు.


విజయనగర్ కాలనీలోని ఓ బ్యాంక్ ఏటీఎంలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం కనిపించడంతో ప్రజలు ఆందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న మెహదీపట్నం పోలీసులు వెంటనే ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు.

మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ప్రమాదవశాత్తు మరణమా.. లేక హత్య జరిగిందా.. అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటనపై అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి విచారణ కొనసాగిస్తున్నారు.

# ఈ 26న టేకులపల్లిలో బ్రహ్మంగారి ఆరాధన మహోత్సవాలు

ఖమ్మం, ఏప్రిల్ 23:భవిష్యత్ కాలజ్ఞాన ప్రభోదకర్త శ్రీ పోతులూరు వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధన గురుపూజ మహోత్సవాలు టేకులపల్లి గ్రామంలోని శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి వారి దేవాలయంలో ఈ నెల 26న నిర్వహించనున్నారు. బ్రహ్మంగారి 333వ ఆరాధన మహోత్సవాల సందర్భంగా ఆలయం శోభాయమానంగా ముస్తాబవుతోంది. వైశాఖ శుద్ధ దశమి సందర్భంగా ఆదివారం ఈ నెల 26న ఈ మహోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. విశ్వకర్మ వంశానికి చెందిన పుణ్యదంపతులు ప్రకృతాంబ, పరిపూర్ణయాచార్యులకు పుత్రునిగా జన్మించిన వీరబ్రహ్మేంద్ర స్వామి గోవిందమాంబను వివాహమాడి, కాలజ్ఞానాన్ని రచించి భూత, భవిష్యత్, వర్తమాన విషయాలను జగత్తుకు తెలియజేశారు. 1693 సంవత్సరంలో వైశాఖ శుద్ధ దశమి నాడు సజీవ సమాధి పొందిన స్వామి వారు భక్తుల ఆరాధ్యదైవంగా నిలిచారు.

ఈ నెల 26న పూజా కార్యక్రమాలు ఉదయం 6 గంటల నుండి ప్రాతఃకాల పూజలు, స్వామి వారి జెండా, చిత్రపటం, పల్లకి, పాదుకలను ఊరేగింపుగా ఆలయానికి తీసుకొస్తారని, గణపతి పూజ, పుణ్యాహవచనాలు, ఉత్సవమూర్తులకు పంచామృత, సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు, సహస్రనామార్చన, మహానివేదన, మంత్రపుష్పం, మంగళ హారతులు, తీర్థప్రసాదాల పంపిణీ జరుగుతుంది. మధ్యాహ్నం 12:30 గంటలకు మహా అన్నదానం నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఈ మహోత్సవాలలో పాల్గొని స్వామి వారి దర్శనం చేసుకుని తీర్థప్రసాదాలు స్వీకరించి ఆశీస్సులు పొందాలని ఆలయ నిర్వాహకులు భక్తులను కోరారు.




# వైద్య సేవలు కేవలం ఆసుపత్రులకే పరిమితం కాకూడదు.. రిషికేశ్ ఎయిమ్స్‌లో టెలిమెడిసిన్, ఆవిష్కరణలను ప్రశంసించిన ఉపరాష్ట్రపతి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 23:ఉత్తరాఖండ్‌లోని రిషికేశ్ లో ఉన్న ఆల్ ఇండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్) 6వ స్నాతకోత్సవ వేడుకల్లో నేడు భారత ఉపరాష్ట్రపతి శ్రీ సీపీ రాధకృష్ణన్ ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ.. పట్టభద్రులవుతున్న విద్యార్థుల జీవితంలో ఇది మార్పు, ఆత్మపరిశీలన, బాధ్యతకు సంబంధించిన కీలకమైన సమయమని అభివర్ణించారు.

రిషికేశ్ ఆధ్యాత్మిక, సాంస్కృతిక ప్రాముఖ్యతను ఉపరాష్ట్రపతి ప్రస్తావించారు. రిషికేశ్ ప్రపంచ స్థాయి ఆధ్యాత్మిక చింతనకు, ప్రశాంతతకు నిలయమని, హిమాలయాలకు ముఖద్వారమని పేర్కొన్న ఉపరాష్ట్రపతి.. ఇలాంటి పవిత్రమైన ప్రదేశంలో ఈ స్నాతకోత్సవ వేడుకలు జరగడం ఈ కార్యక్రమానికి మరింత అర్థాన్ని ఇస్తుందని అన్నారు.

స్నాతకోత్సవం.. కేవలం ఇన్నేళ్ల క్రమశిక్షణతో కూడిన కృషికి, త్యాగానికి లభించిన ముగింపు మాత్రమే కాదనీ, సమాజం, దేశం పట్ల మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన సమయమానికి ఆరంభమని శ్రీ సీపీ రాధ కృష్ణన్ అన్నారు. పట్టభద్రులందరూ వృత్తిపరమైన విధులను అంకిత భావంతో, గొప్ప లక్ష్యంతో నిర్వర్తించాలని ఆయన కోరారు.

కోవిడ్-19 మహమ్మారి తీసుకొచ్చిన సవాళ్లను ప్రస్తావిస్తూ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో భారత్ పట్టుదలను, ఆవిష్కరణలను, నిబద్ధతను చాటుకుందని ఉపరాష్ట్రపతి పేర్కొన్నారు. దేశంలోని 140 కోట్లకు పైగా పౌరులకు ఉచితంగా వ్యాక్సిన్లను అందించడం ద్వారా ప్రతి ఒక్కరికీ వైద్య సేవలు సమానంగా అందేలా చేసిన భారీ టీకా కార్యక్రమాన్ని కొనియాడారు. భారతీయ శాస్త్రవేత్తలు కేవలం లాభాపేక్ష కోసం కాకుండా, మానవ సంక్షేమం కోసమే టీకాలను అభివృద్ధి చేసినట్లు చెప్పారు.

100 కంటే ఎక్కువ దేశాలకు టీకాలను సరఫరా చేసిన 'వ్యాక్సిన్ మైత్రి' కార్యక్రమం ద్వారా భారత్ తన ప్రపంచ బాధ్యతను సమర్థవంతంగా నిర్వహించిందని ఉపరాష్ట్రపతి తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా 'వసుధైక కుటుంబం' స్ఫూర్తిని ప్రతిబింబించడమే కాకుండా, బాధ్యత కలిగిన ప్రపంచ భాగస్వామిగా భారత్ తన పాత్రను మరింత బలోపేతం చేసిందని అన్నారు.

ఆరోగ్య మౌలిక సదుపాయాల విస్తరణ గురించి వివరిస్తూ.. గత దశాబ్ద కాలంలో దేశవ్యాప్తంగా కొత్తగా ఏర్పాటు చేసిన ఎయిమ్స్ సంస్థలు... ముఖ్యంగా వెనకబడిన ప్రాంతాల్లో నాణ్యమైన వైద్య సేవలను, వైద్య విద్యను ప్రజలకు చేరువ చేశాయని ఉపరాష్ట్రపతి శ్రీ సీపీ రాధాకృష్ణన్ పేర్కొన్నారు. ప్రజల అవసరాలను అర్థం చేసుకుని వారికి సేవ చేయడమే సుపరిపాలనకు అసలైన అర్థమని ఆయన వ్యాఖ్యానించారు.

ఎయిమ్స్ రిషికేశ్ పై ఉపరాష్ట్రపతి ప్రశంసలు కురిపించారు. వైద్య సేవలు, మంచి విద్యా బోధన, పరిశోధన, ఆవిష్కరణ సామాజిక నిబద్ధత కలిగిన ఈ సంస్థ ఒక అద్భుతమైన ప్రదర్శనకు ఆదర్శంగా నిలిచిందని కొనియాడారు. ముఖ్యంగా ఇక్కడి టెలిమెడిసిన్ కార్యక్రమాలను ఆయన అభినందించారు. వైద్య సేవలు కేవలం ఆసుపత్రి ప్రాంగణాలకే పరిమితం కాకుండా, మారుమూల, వెనుకబడిన ప్రజలకు కూడా చేరాలని సూచించారు.

హెలికాప్టర్ ద్వారా అత్యవసర వైద్య సేవలు, చార్ ధామ్ యాత్ర సమయంలో మారుమూల ప్రాంతాలకు మందులను చేరవేసేందుకు డ్రోన్లను ఉపయోగించడం వంటి వినూత్న ఆరోగ్య సేవలను ఉపరాష్ట్రపతి అభినందించారు. వైద్య సేవల రంగంలో దీర్ఘకాలంగా ఉన్న సవాళ్లకు ఇవి సమర్థవంతమైన పరిష్కారాలని పేర్కొన్నారు.

ఢిల్లీ-డెహ్రాడూన్ ఎక్స్‌ప్రెస్‌వేతో సహా ఈ ప్రాంతంలో మౌలిక సదుపాయాల వేగవంతమైన అభివృద్ధిని ఉపరాష్ట్రపతి ప్రత్యేకంగా ప్రస్తావించారు. సమ్మిళిత అభివృద్ధిని ప్రోత్సహించడం, మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడం, వైద్య సేవలను మెరుగుపరచడంలో ముఖ్యమంత్రి శ్రీ పుష్కర్ సింగ్ ధామి నాయకత్వంలోని ఉత్తరాఖండ్ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను ఆయన అభినందించారు.

వైద్య సేవలు ప్రజల నమ్మకానికి నిదర్శనమని, దేశ నిర్మాణంలో వైద్య నిపుణులు కీలక పాత్ర పోషిస్తారని శ్రీ సీపీ రాధాకృష్ణన్ తెలిపారు. ముందస్తు జాగ్రత్త చర్యలు, వైద్య సేవలు గ్రామాలకూ చేరుకోవడం, పరిశోధన, ఆవిష్కరణల ద్వారా దేశానికి తమ వంతు సహకారం అందించాలని సూచించారు. సానుభూతి, నిజాయితీ, సేవా దృక్పథం వంటి విలువలతో ముందుకు సాగాలని ఆయన కోరారు.

ఈ కార్యక్రమంలో ఉత్తరాఖండ్ గవర్నర్ లెఫ్టినెంట్ జనరల్ గుర్మీత్ సింగ్ (పదవీ విరరమణ), ముఖ్యమంత్రి శ్రీ పుష్కర్ సింగ్ ధామి, కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి శ్రీమతి అనుప్రియ పటేల్, ఎయిమ్స్ రిషికేశ్ అధ్యక్షులు ప్రొఫెసర్ రాజ్ బహదూర్, డీన్ (అకడమిక్) ప్రొఫెసర్ సౌరభ్, ఎయిమ్స్ కార్యనిర్వాహక డైరెక్టర్ ప్రొఫెసర్ మీను సింగ్, అధ్యాపక బృందం, విద్యార్థులు, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం

**-హైదరాబాద్ లో ప్రారంభమైన ఎన్ యుజేఐ జాతీయ కార్యవర్గ సమావేశాలు**

**-తెలంగాణ కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి**




హైదరాబాద్, ఏప్రిల్ 23:జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందని తెలంగాణ కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. గురువారం నగరంలోని చిక్కడపల్లిలో హోటల్ శ్రీ వేద ప్రీమియంలో తెలంగాణ స్టేట్ జర్నలిస్టు యూనియన్ (టీఎస్ జెయు) ఆధ్వర్యంలో నేషనల్ జర్నలిస్టు యూనియన్ ఆఫ్ (ఇండియా) జాతీయ కార్యవర్గ సమావేశాల ప్రారంభోపన్యాసం చేశారు.

ఈ సందర్భంగా మంత్రి వెంకట స్వామి మాట్లాడుతూ జర్నలిస్టులకు అనేక సమస్యలు ఎదుర్కొంటున్న విషయం తెలుసునని, వాటి పరిష్కారం కోసం కృషి చేస్తానని అన్నారు. జర్నలిస్టులు నిరంతరం ప్రజల మధ్యలో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని సూచించారు.

ఈ సమావేశంలో ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షురాలు హనుమాన్ల ఝాన్సీ రెడ్డి, ఎన్ యుజె(ఐ) జాతీయ అధ్యక్షులు సురేష్ శర్మ జాతీయ ప్రధాన కార్యదర్శి త్రియగ్ నారాయణ, టీఎస్ జెయు రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు పురుషోత్తం నారగౌని, తోకల అనిల్ కుమార్, స్కూల్ ఆఫ్ జర్నలిజం చైర్మన్ నాగేశ్వరరావు, ఎన్ యుజె(ఐ) కార్యదర్శి మెరుగు చంద్రమోహన్, రాజు పటేల్, అరుణ్ కుమార్, పావుశెట్టి శ్రీనివాస్, తడుక సుధాకర్, ఎడ్ల సంతోష్, దొమ్మటి రవి, కందికొండ మోహన్, చిగ్రగోని ఉదయ్ దీర్, ఉప్పలంచి నరేందర్, పోచంపల్లి రజిత, నాగరాజు, శ్రీనాథ్, అవునూరి సంపత్, గట్టు మహేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# వైఎస్ జగన్ నివాసానికి వెళ్లి వేదాశీర్వచనం.. ఒంటిమిట్ట అర్చకులపై టీటీడీ ఆగ్రహం



తిరుపతి, ఏప్రిల్ 23: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కడప జిల్లా ఒంటిమిట్టలోని శ్రీ కోదండరామస్వామి ఆలయానికి చెందిన ముగ్గురు అర్చకులపై తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆలయ నిబంధనలకు విరుద్ధంగా పులివెందులలో మాజీ సీఎం జగన్ నివాసానికి వెళ్లి ఆయనకు వేదాశీర్వచనం అందించినందుకుగాను ఆ ముగ్గురు అర్చకులకు షోకాజ్ నోటీసులు జారీచేసింది. ఆ అర్చకులు ప్రొటోకాల్ ఉల్లంఘించారని విమర్శించింది.

ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి ఆలయం టీటీడీ పరిధిలో ఉన్నది. ఈ ఆలయంలో పనిచేసే ముగ్గురు అర్చకులు ఇతర అర్చకులతో కలిసి జగన నివాసంలో ఆయనకు వేదాశీర్వచనం అందించారు. వారు ఇలా ప్రొటోకాల్‌ను అతిక్రమించడంపై యాజమాన్యం తీవ్రంగా స్పందించింది. వ్యక్తిగత హోదాలో రాజకీయ నాయకుల ఇళ్లకు వెళ్లి ఆలయ మర్యాదలను పాటించకపోవడం సరికాదని మండిపడింది. సదరు అర్చకులపై చర్యలకు ఉపక్రమించింది.

తాము జారీ చేసిన షోకాజ్ నోటీసులకు రెండు రోజుల్లోగా వివరణ సమర్పించాలని అర్చకులను టీటీడీ ఆదేశించింది. వారు ఇచ్చే సమాధానం సంతృప్తికరంగా లేకపోతే కఠినమైన క్రమశిక్షణా చర్యలు తప్పవని హెచ్చరించింది. ఆలయ పవిత్రత, నియమ నిబంధనల విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని టీటీడీ వర్గాలు స్పష్టంచేశాయి. అయితే ఈ నోటీసులపై అర్చకుల నుంచి ఎలాంటి స్పందన లేదు.

